సర్వర్ కష్టాలు



తిక్కన భవన్ ఎదుట అర్జీదారుల నిరీక్షణ



ఆన్‌లైన్ వ్యవస్థ నిలిచి పోవడంతో కంప్యూటర్ల ముందు ఖాళీగా సిబ్బంది

నెల్లూరు(కలెక్టరేట్), న్యూస్‌టుడే: నెల్లూరు కలెక్టరేట్ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఆన్‌లైన్ వ్యవస్థ పనిచేయక అర్జీదారులు అవస్థలు ఎదుర్కొన్నారు. జిల్లా నలుమూలల నుంచి తరలివచ్చిన ప్రజలకు అర్జీలు రాసిచ్చి ఆన్‌లైన్ చేసిన తర్వాత టోకెన్ ఇస్తారు. టోకెన్ ప్రకారం అధికారుల వద్దకు వెళ్లి అర్జీలు సమర్పిస్తారు. ఆన్‌లైన్ చేయడం వల్ల తమ సమస్య పరిష్కారం అయిందా.. లేదా.. తెలుసుకోవచ్చు. సర్వర్ పని చేయకపోవడంతో టోకెన్ ఇచ్చి అధికారుల వద్దకు పంపించారు. సోమవారం 330 అర్జీలు వచ్చాయి. ఇవన్నీ ఆన్‌లైన్ చేయకపోవడంతో ప్రజల సమస్యలు పరిష్కారమయ్యాయో.. లేదో తెలియని పరిస్థితి. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించే తిక్కన భవన్ తలుపులు మూసి ఉంచడంతో వేచి చూడాల్సిన పరిస్థితి నెలకొంది. ● డీఆర్వో లవన్న మాట్లాడుతూ ప్రజల నుంచి తీసుకున్న అర్జీలను మళ్లీ ఆన్‌లైన్ చేస్తామని తెలిపారు.

విధి ఆటలో..
ఓడిన క్రీడాకారిణి!

- మద్దూరుపాడు వద్ద రోడ్డు ప్రమాదం
- బాలిక దుర్మరణం.. యువకుడికి గాయాలు



కావలి, ఒంగోలు నేరవిభాగం, న్యూస్‌టుడే: కావలి పట్టణ శివారులోని మద్దూరుపాడు వద్ద సోమవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో మైథిలీ అనే బాలిక మృతి చెందగా- కృపాకర్ అనే యువకుడు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వారిద్దరూ ద్విచక్ర వాహనంపై వస్తుండగా- గుర్తు తెలియని వాహనం ఢీకొంది. ఆ క్రమంలో కృపాకర్ ఎడమవైపు పడిపోగా.. మైథిలి కుడివైపు పడిపోయారు. అదే సమయంలో అటుగా వచ్చిన లారీ.. ఆమె కాళ్లపై నుంచి దూసుకువెళ్లింది. తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాద విషయం తెలిసి, అక్కడికి చేరుకున్న పోలీసులు.. ఆమెను స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతురాలి తండ్రి వేణు ఫిర్యాదు మేరకు కావలి గ్రామీణ పోలీసు స్టేషన్ ఎస్సై బాజీబాబు కేసు నమోదు చేసి.. దర్యాప్తు చేస్తున్నారు.

అలా.. పోటీలకు వెళ్లొస్తూ..

ప్రకాశం జిల్లా పొన్నలూరు మండలం ముండ్లమూరివారిపాలేనికి చెందిన 15 ఏళ్ల ఫుట్‌బాల్ క్రీడాకారిణి మైథిలి.. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పోటీల్లో పాల్గొనే.. జిల్లా అండర్-17 జట్టుకు ఎంపికయ్యారు. పల్నాడు జిల్లా వినుకొండలో గత నెల 28, 29, 30 తేదీల్లో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహించారు. లీగ్ దశలోనే జట్టు ఓటమిపాలవడంతో జట్టు శిక్షకులు, మేనేజరు బాలికలను తీసుకుని ఆదివారం రాత్రి తిరుముఖం పట్టారు. రాత్రి సుమారు 9.40 గంటల సమయంలో ఒంగోలు బస్టాండ్‌కు చేరారు. ఆ రాత్రికి క్రీడాకారిణులను ఏదైనా బాలికల వసతి గృహంలో సురక్షితంగా ఉంచి.. తెల్లారిన తర్వాత వారి కుటుంబీకులను పిలిపించి స్వస్థలాలకు పంపించాల్సి ఉంది. అక్కడే నిర్వాహకులు నిర్లక్ష్యంగా వ్యవహరించారు. రాత్రి సుమారు పది గంటల సమయంలో క్రీడాకారిణులను వారి దారిన వారిని వదిలేశారు. మైథిలిని ఆమె కోసం వచ్చిన కృపాకర్ అనే యువకుడితో పంపించి చేతులు దులుపుకొన్నారు. వీరిద్దరూ ద్విచక్ర వాహనంపై వెళుతుండగా.. నెల్లూరు జిల్లా మద్దూరుపాడు వద్ద ప్రమాదం చోటుచేసుకుంది. మైథిలీ చనిపోగా.. కృపాకర్ తీవ్ర గాయాలతో చికిత్స పొందుతున్నాడు. నిర్వాహకుల నిర్లక్ష్యంపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ఆరోగ్యశ్రీకి
అవినీతి జబ్బు


ప్రైవేటు ఆసుపత్రుల్లో అదనపు వసూళ్లు

● నెల్లూరు నగరానికి చెందిన శారదమ్మ ఇంట్లో పని చేస్తూ.. కిందపడ్డారు. కుటుంబ సభ్యులు వెంటనే ఓ ప్రైవేటు న్యూరో ఆసుపత్రికి తీసుకువెళ్లారు. మెదడులో రక్తం గడ్డ కట్టి.. పరిస్థితి విషమంగా ఉందని, పెద్ద ఆసుపత్రికి తీసుకువెళ్లాలని సూచించారు. దాంతో ఆరోగ్యశ్రీ పరిధిలో ఉన్న ఓ పేరున్న ఆసుపత్రిలో చేర్పించారు. కుటుంబ సభ్యులు అప్పు చేసి. . రూ. 90వేలు చెల్లించారు. మరోవైపు ఆరోగ్యశ్రీ కార్డు ద్వారా రూ. 80 వేలు మంజూరైంది. ఇంత చేసినా.. శస్త్రచికిత్స జరిగిన కొన్ని రోజుల్లోనే మృతి చెందడంతో బాధితులు ఆక్రోశం వ్యక్తం చేశారు.

● గూడూరు ప్రాంతానికి చెందిన ఓ వృద్ధురాలు అనారోగ్యంతో బాధపడుతుండగా.. నగరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తీసుకొచ్చారు. అక్కడ డయాలసిస్ చేయాలని చెప్పారు. ఆరోగ్యశ్రీ వర్తించకపోతే డబ్బు చెల్లించాలని చెప్పారు. ముందుగా డయాలసిస్‌కు అవసరమయ్యే కిట్‌లు, పరీక్షల పేరుతో రూ. పది వేలు కట్టించుకున్నారు. రెండు రోజుల తర్వాత ఆరోగ్యశ్రీ మంజూరైందని తెలిపారు. మొదట చెల్లించిన డబ్బు అడిగితే.. అవి రావని చెప్పారు.

మొక్కుబడి తనిఖీలు.. ఆరోపణలు వచ్చినా నామమాత్రపు చర్యలు.. ఎవరేమి చేస్తారులే అన్న భావనో.. కొన్ని ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆసుపత్రుల ధనదాహానికి పేదలు బలవుతున్నారు. ఉచితంగా అందాల్సిన వైద్య చికిత్సలకు.. అప్పులు చేయాల్సిన పరిస్థితిలో తల్లడిల్లుతున్నారు.


న్యూస్‌టుడే, నెల్లూరు (వైద్యవిభాగం)



జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకు 7,57,754 కుటుంబాలకు ఆరోగ్యశ్రీ స్మార్ట్ హెల్త్ కార్డులు అందజేయగా- 123 నెట్‌వర్క్ ఆసుపత్రులు ఉన్నాయి. వీటితో పాటు హైదరాబాద్, చెన్నై, బెంగళూరు నగరాల్లోని మరో 17 సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రుల్లో కూడా చికిత్స పొందొచ్చు. ఇక ఈ ఆసుపత్రులకు రోజువారీ సరాసరిన 200 కేసులు వస్తున్నాయి. పథకం కింద వైద్య సేవలు పొందేవారిలో 60 శాతం గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చే పేద, మధ్య తరగతి ప్రజలే ఉంటున్నారు



ఓ ఆసుపత్రిలో ఆరోగ్యశ్రీ కేంద్రం



దోపిడీ ఇలా...

కొన్ని ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆసుపత్రులు రోగులు రాగానే.. పరీక్షలు, మందుల పేరుతో రూ. పదివేల నుంచి రూ. 20వేల వరకు ఖర్చు పెట్టిస్తున్నాయి. ఇంకొన్ని అత్యవసర వైద్యం పేరుతో భయపెడుతున్నాయి. నాణ్యమైన స్టెంట్ పేరుతో గుండెజబ్బు బాధితుల నుంచి రూ. 50 వేల మొదలు రూ. లక్ష వరకు వసూలు చేస్తున్నారు. కాళ్లు, చేతులు విరిగితే.. నాణ్యమైన రాడ్లు అమర్చుతామంటూ డబ్బు గుంజుతున్నారు. మరోవైపు ఆరోగ్యశ్రీ కింద కూడా మంజూరు చేయించుకుంటున్నారు. ఎక్కువగా ట్రామాకేర్ ఉండే ఆసుపత్రులపై ఆరోపణలు వస్తుండగా- తమకు అన్యాయం జరిగిందని ఎవరైనా బాధితులు ఆందోళనకు దిగితే.. ఎంతో కొంత లెక్కగట్టి పంపిస్తున్న పరిస్థితి. కొవిడ్ సమయంలో అవకతవకలకు పాల్పడినట్లు రుజువు కావడంతో ఓ పేరున్న ఆసుపత్రికి రూ. 75 లక్షల వరకు జరిమానా విధించారు. రోగుల నుంచి వచ్చిన ఫిర్యాదుల మేరకు మరో రూ. 25 లక్షల వరకు జరిమానా విధించినట్లు సమాచారం.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

– మురళి, ఆరోగ్యశ్రీ జిల్లా ఇన్‌ఛార్జి కోఆర్డినేటర్

ఆరోగ్యశ్రీ చికిత్సలు అందించే నెట్‌వర్క్ ఆసుపత్రులు అదనంగా డబ్బు అడిగినట్లు తెలిస్తే చర్యలు తప్పవు. అదనంగా డబ్బు కట్టిన వారు ఎవరైనా.. వెంటనే ఫిర్యాదు చేస్తే తిరిగి ఇప్పించడంతో పాటు సంబంధిత ఆసుపత్రిపై చర్యలు తీసుకుంటాం. బాధితులు 104, 14400 హెల్ప్‌లైన్ నంబర్లకు ఫిర్యాదు చేయవచ్చు.

కసుమూరు దర్గాలో...
ఏఆర్ రెహమాన్ ప్రార్థనలు



కసుమూరు దర్గాలో ఏఆర్ రెహమాన్, శివమణి



ఏఎస్‌పేట: వక్ఫ్‌బోర్డు ఛైర్మన్ అబ్దుల్ అజీజ్‌ను సన్మానిస్తున్న నిర్వాహకులు

వెంకటాచలం, అనుమసముద్రంపేట, న్యూస్‌టుడే: వెంకటాచలం మండలంలోని కసుమూరు మస్తాన్ వలీ, ఏఎస్‌పేటలోని ఖాజానాయబ్ రసూల్ దర్గాల్లో గంధమహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. కసుమూరు దర్గాను ప్రముఖ సంగీత దర్శకుడు ఏఆర్ రెహమాన్ దర్శించుకున్నారు. కడప దర్గా పీఠాధిపతి ఆరీఫుల్లా హుస్సేనీతో కలిసి సోమవారం గంధోత్సవంలో పాల్గొని.. ప్రత్యేక ప్రార్థనలు చేశారు. రెహమాన్ వెంట సినీ సంగీత వాయిద్య కారుడు శివమణి కూడా ఉన్నారు. వీరిని చూసేందుకు స్థానికులు, భక్తులు పోటీపడ్డారు. ● ఏఎస్‌పేట దర్గా గంధోత్సవంలో సోమవారం రాష్ట్ర వక్ఫ్‌బోర్డు ఛైర్మన్ అబ్దుల్ అజీజ్ పాల్గొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున పూల చద్దర్ సమర్పించి.. ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

పల్లె.. పరవశించేలా..!

కొత్త రోడ్లు, మరమ్మతులకు రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం

ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్న పంచాయతీరాజ్ ఇంజినీర్లు

మర్రిపాడు మండలం రాజులపాడు గ్రామంలో సుమారు 100 కుటుంబాలు ఉండగా– 300కుపైగా జనాభా ఉన్నారు. ఈ గ్రామానికి ఏళ్లుగా రోడ్డు సక్రమంగా లేక.. ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వ నిర్ణయంతో పరిస్థితి మారనుంది.



ఈనాడు, నెల్లూరు: మర్రిపాడు, న్యూస్‌టుడే

వైకాపా ప్రభుత్వం గ్రామీణ రహదారులను తీవ్ర నిర్లక్ష్యం చేసింది. అడుగడుగునా గోతులతో అధ్వానంగా మారినా.. పల్లె ప్రయాణం ప్రాణ సంకటంగా మారినా.. కనీస మరమ్మతులకూ ఆసక్తి చూపించలేదు. ఏటా అధికారులు ప్రతిపాదనలు పెట్టడం.. నాటి ప్రభుత్వం వాటిని బుట్టదాఖలు చేయడం.. గడిచిన అయిదేళ్లలో పరిపాటిగా మారింది. దీంతో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే.. ఈ పరిస్థితిని చక్కదిద్దేందుకు నడుం కట్టింది. క్షేత్రస్థాయిలో పరిశీలించి.. అత్యవసర పనులను గుర్తించి.. వెంటనే ప్రతిపాదనలు పంపాలని అధికారులను ఆదేశించింది. సరైన రోడ్డు సదుపాయం లేని గ్రామాలను గుర్తించడంతో పాటు గిరిజన గ్రామాలకూ ప్రత్యేకంగా నిధులు కేటాయించనుంది.

జిల్లా పంచాయతీరాజ్ పర్యవేక్షణలోని సుమారు 1482.21 కి.మీ. తారు, సీసీ రోడ్లను సాంకేతిక నిపుణులు పరిశీలించారు. వాటిలో 278.9 కి.మీ. అధ్వానంగా, మరో 301.21 కి.మీ. పాక్షికంగా దెబ్బతిన్నట్లు గుర్తించారు. వీటి మరమ్మతులకు రూ. 120 కోట్ల నిధులు ఇవ్వాలని ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపారు. త్వరలోనే ఆమోదం రానున్నట్లు సంబంధిత వర్గాలు చెబుతున్నాయి.

● దీనిపై పంచాయతీరాజ్ ఎస్‌ఈ మాట్లాడుతూ.. గ్రామీణ రహదారుల అభివృద్ధికి సంబంధించిన ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపించాం. రహదారులు లేని గ్రామాలను గుర్తించి.. వెంటనే ప్రతిపాదనలు చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. ఆ మేరకు క్షేత్రస్థాయిలో వివరాలు సేకరిస్తున్నాం. రహదారులకు మరమ్మతులు కూడా చేపట్టబోతున్నాం అని తెలిపారు.

విజన్ డాక్యుమెంట్‌లో భాగంగా...

స్వర్ణాంధ్ర-2047 విజన్ డాక్యుమెంట్‌లో భాగంగా రహదారులు లేని గ్రామాలను గుర్తించి, వెంటనే నిర్మాణాలు చేపట్టాలని నిర్ణయించారు. దీనిపై జిల్లాలోని 37 మండలాల్లో అధికారులు సర్వే చేపట్టారు. గతంలో 500 కంటే అధిక జనాభా ఉన్న గ్రామాలను గుర్తించి రోడ్లు నిర్మించగా.. తాజాగా నాలుగు కేటగిరీలుగా పరిశీలిస్తున్నారు. 100 కంటే ఎక్కువ, 101 నుంచి 249 వరకు, 250 నుంచి 499, 500 కంటే ఎక్కువ జనాభా ప్రాతిపదికన సర్వే చేస్తున్నారు. ఇప్పటికే దాదాపు 60 శాతం పూర్తయినట్లు అధికారులు చెబుతున్నారు. ఈ ప్రక్రియ పూర్తయిన వెంటనే.. ప్రతిపాదనలు పంపడం.. ఆపై వీలైనంత త్వరగా బీటీ, సిమెంట్ రోడ్లు నిర్మించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. దీంతో పాటు ఎన్నో ఏళ్లుగా అసౌకర్యాలతో కొట్టుమిట్టాడుతున్న గిరిజన గ్రామాల అభివృద్ధికి ప్రధానమంత్రి జన్ జాతీయ ఉన్నత్ గ్రామ్ అభియాన్ ద్వారా 25 రకాల అభివృద్ధి పనులు చేపట్టేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

14 నుంచి దివ్యాంగులకు సదస్సులు: కలెక్టర్


నెల్లూరు(కలెక్టరేట్), న్యూస్‌టుడే: దివ్యాంగుల కోసం జిల్లాలోని 38 మండల కేంద్రాల్లో అక్టోబరు 14 నుంచి సదస్సులు నిర్వహించాలని కలెక్టర్ ఒ.ఆనంద్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని ఛాంబరులో దివ్యాంగుల నైపుణ్యాభివృద్ధి, సాధికారత, పునరావాస కల్పన సమ్మిళిత కేంద్రం ప్రతినిధులు, అధికారులతో సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సీఆర్సీ కేంద్రం ఆధ్వర్యంలో ఒక్కో మండల కేంద్రంలో ఒక్కో సోమవారం ప్రత్యేక సదస్సులు నిర్వహించాలని సూచించారు. సదస్సులో దివ్యాంగుల నుంచి దరఖాస్తులు స్వీకరించి, వారికి అవసరమైన పరికరాలు అందించాలని తెలిపారు. వెంకటాచలం మండలం సమీపంలోని అనుపల్లిపాడు రైల్వేగేటు వద్ద గల సీఆర్సీ కేంద్రం ఆధ్వర్యంలో వికలాంగులకు అందిస్తున్న వివిధరకాల వృత్తి నైపుణ్య కోర్సులు, స్పీచ్ థెరపి, ఆడియో థెరపి, వికలాంగుల మానసిక స్థితి మెరుగుపడేందుకు నిర్వహిస్తున్న వివిధ రకాల కృత్యాలపై సదస్సుల్లో అవగాహన కల్పించాలని తెలిపారు. సమావేశంలో డీఆర్వో లవన్న, వికలాంగుల సంక్షేమ శాఖ ఏడీ వినయ్‌కుమార్, డీఎంహెచ్‌వో డాక్టర్ పెంచలయ్య, జడ్పీ సీఈవో ఖాదర్‌బాషా, సీఆర్సీ కేంద్రం డైరెక్టర్ మనోజ్‌కుమార్, కె.ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు 12 అంకెల గుర్తింపు కార్డులు

నెల్లూరు(విద్య): అన్ని యాజమాన్య పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు జాతీయ విద్యావిధానంలో భాగంగా ఆధార్ మాదిరిగా 12 అంకెల గుర్తింపు కార్డులు ఇవ్వనున్నారు. ఇందుకు సంబంధించి జిల్లా విద్యాశాఖాధికారులకు ఆదేశాలు అందాయి. ఈ నెల 14 నుంచి విద్యార్థుల పూర్తి వివరాలను వారి తల్లిదండ్రుల నుంచి సేకరించి విద్యాశాఖాధికారులు సిద్ధం చేయనున్నారు. విద్యార్థి పేరు, ఫొటో, పుట్టిన తేదీ, క్యూఆర్‌కోడ్‌తో కూడిన వివరాలు సిద్ధం చేసి.. దసరా సెలవుల అనంతరం ప్రధానోపాధ్యాయులు యూడైస్‌లో నమోదు చేస్తారు.

టెట్‌కు.. పోటీ ఎక్కువే!

3 నుంచి 21 వరకు పరీక్ష



నెల్లూరు(విద్య), న్యూస్‌టుడే: జిల్లా విద్యా శాఖ అధికారులు ఉపాధ్యాయ అర్హత పరీక్ష(టెట్)కు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ నెల 3 నుంచి 21వ తేదీ వరకు.. జిల్లాలో ఏర్పాటు చేసిన నాలుగు కేంద్రాల్లో ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్ష జరగనుంది. జిల్లాలో 9,603 మందికిపైగా పోటీపడుతున్నారు. వైకాపా ప్రభుత్వ హయాంలో వ్యవధి చాలక పరీక్షకు దూరంగా ఉన్నవారు సన్నద్ధమవుతుండటం.. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత మూడు నెలలు పరీక్షకు సమయం ఉండటంతో ఈసారి పోటీ గతంలో ఎన్నడూ లేనంతగా పెరిగింది.

పోస్టుల పెంపుతో...

అయిదేళ్లుగా డీఎస్సీ లేక ఆశలు సన్నగిల్లిన అభ్యర్థులు.. కూటమి ప్రభుత్వం ఎక్కువ పోస్టులు చూపించడంతో భారీగా టెట్‌కు దరఖాస్తు చేసుకున్నారు. గత ప్రభుత్వ హయాంలో జిల్లాకు 189 పోస్టులే చూపింది. కూటమి ప్రభుత్వం పోస్టుల సంఖ్య పెంచింది. 500కుపైగా ఉంటాయని అధికారులు పేర్కొంటున్నారు. దాంతో వెయిటేజీ నేపథ్యంలోనూ దరఖాస్తులు పెరిగాయి.

నాలుగు కేంద్రాల్లో నిర్వహణ


– పీవీజే రామారావు జిల్లా విద్యాశాఖాధికారి

కావలిలోని పీబీఆర్ విశ్వోదయ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, రామిరెడ్డి సుబ్బరామిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాల, నెల్లూరులోని నారాయణ ఇంజినీరింగ్ కళాశాల, జొన్నవాడ రోడ్డులోని ఐయాన్ డిజిటల్ జోన్ సెంటర్‌లో ఆన్‌లైన్ విధానంలో టెట్ పరీక్ష జరుగుతుంది. పరీక్ష కేంద్రానికి అభ్యర్థులు అరగంట ముందు చేరుకోవాలి. హాల్‌టికెట్‌తో పాటు ఏదైనా ఒరిజినల్ గుర్తింపు కార్డు తప్పనిసరిగా తీసుకురావాలి.

కొలువుల పేరుతో ఎర

జిల్లా పోలీసు కార్యాలయానికి బాధితుల బారులు

'ఉద్యోగాల పేరుతో మోసం చేశారు.. ఒకటికి మూడింతలు ఇస్తామంటూ నగదు కాజేశారు'.. ప్రతి సోమవారం జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఇలాంటి ఫిర్యాదులే ఎక్కువగా వస్తున్నాయి. అయినా.. ఎక్కడో ఒక చోట.. ఎవరో ఒకరు ఈ రీతిలో మోసపోతూనే ఉండటం. . అప్రమత్తం కావాల్సిన ఆవశ్యకతను చాటిచెబుతోంది.



ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అర్జీదారులు

న్యూస్‌టుడే, నెల్లూరు(నేర విభాగం)

జిల్లా పోలీసు కార్యాలయానికి సోమవారం 105 అర్జీలు రాగా- వాటిలో అధిక శాతం మోసాలు, ఆర్థిక నేరాలకు సంబంధించినవే ఉన్నాయి. గత కొన్నేళ్లుగా.. కొన్ని సంస్థలు నగదు వసూలు చేసి బోర్డు తిప్పేస్తుండగా.. మరోవైపు గొలుసుకట్టు నగదు లావాదేవీలు, బంగారం పథకాలు, వీక్లీ డ్రా, నగదు చెల్లిస్తే చర, స్థిర ఆస్తులు ఇప్పిస్తామనే సంఘటన జరుగుతున్నాయి. వీటిల్లో కొన్ని వెలుగులోకి వస్తుండగా.. మరికొన్ని గుట్టుగా ఉండిపోతున్నాయి. బాధితుల్లో పేదలతో పాటు ఉద్యోగులు, అధికారులు, రాజకీయ నాయకులు ఉండటం గమనార్హం.

సెప్టెంబరులో పరిస్థితి

తేదీ	మొత్తం అర్జీలు	మోసాలపై ఫిర్యాదులు
2	102	12
9	92	9
23	152	11
30	105	2

రూ. 4.71 లక్షలు తీసుకుని..

ఉద్యోగం ఇప్పిస్తామని చెప్పి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అటెండరుగా పని చేస్తున్న వెంకటేష్ రూ. 4.71 లక్షలు తీసుకుని.. మోసగించారని ఆత్మకూరు పరిధిలోని ఓ మహిళ ఫిర్యాదు చేయగా- బెంగళూరు, హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పి నెల్లూరుకు చెందిన ప్రవీణ్ రూ. 17 లక్షలు తీసుకున్నాడని, ఉద్యోగం లేదు.. తీసుకున్న నగదు ఇవ్వడం లేదని వేదాయపాళేనికి చెందిన బాధితుడు పోలీసులకు విన్నవించారు.

రూ. లక్షకు.. రూ.మూడు లక్షలని..

నెల్లూరు గ్రామీణం పరిధిలోని గుండ్లపాలేనికి చెందిన ఎస్‌కే హాసన్.. అలియాస్ కార్తీక్ రెడ్డి.. 'బారిష్' కొత్త పథకానికి తెరలేపాడు.. రూ. లక్ష ఇస్తే రూ. 3 లక్షలు ఇస్తానని, అందుకు మూడు నెలల నుంచి ఆరు నెలల సమయం పడుతుందని నమ్మబలికాడు.. పామూరుకు చెందిన మల్లికార్జున రూ. 25 లక్షలు, గుంటూరుకు చెందిన గోవిందరావు రూ. 2.5 లక్షలు ఇచ్చారు. నగదు ఇచ్చి.. నెలలు గడుస్తున్నా.. నగదు రెట్టింపు కాలేదు. ప్రశ్నిస్తే.. తమ వారితో బెదిరిస్తున్నాడని, తమకు న్యాయం చేయాలని బాధితులు ఫిర్యాదు చేశారు.

న్యాయం చేస్తాం..

– సీహెచ్ సౌజన్య, జిల్లా అదనపు ఎస్పీ

జిల్లా పోలీసు కార్యాలయానికి వచ్చిన అర్జీలను.. ఆయా స్టేషన్లకు పంపించాం. వీలైనంత వరకు సమస్యలు పరిష్కరించి.. బాధితులకు న్యాయం చేస్తాం.



ఆరోగ్య మాట.. వ్యాయామ బాట

నగరంలో జిమ్‌లు – 33
ఒక్కో దానిలో సభ్యులు 150 నుంచి 200 మంది
వ్యాయామశాలకు వెళ్తున్న వారి వయసు.. శాతం
18 నుంచి 30 – 40
31 నుంచి 40 – 35
41 నుంచి 50 – 20
50 ఏళ్లు పైబడినవారు – 5

ఉద్యోగంలో పని ఒత్తిడి.. లక్ష్యం కోసం పరుగులు.. మారిన జీవనశైలితో నగరవాసులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సమయపాలన లేని ఆహారంతో వ్యాధులు దరిచేరుతున్నాయి. దీనికి వ్యాయామమే సరైన మార్గమని భావించి.. రోజుకు గంట సమయం కేటాయిస్తున్నారు.

వ్యాయామశాలల వైపు యువత

న్యూస్‌టుడే, నెల్లూరు (క్రీడా విభాగం)

కాలానుగుణంగా నగర ప్రజల అలవాట్లు మారుతున్నాయి. ఆరోగ్య స్పృహ పెరిగింది. ఉదయం లేవగానే వ్యాయామశాలలకు వెళ్లే వారు ఎక్కువవుతున్నారు. ఆరోగ్యకర జీవితానికి వయసుతో సంబంధం లేకుండా ప్రతిఒక్కరూ 'జిమ్' బాట పడుతున్నారు. ముఖ్యంగా సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు ఉదయం, సాయంత్రం శ్రద్ధ చూపుతున్నారు. ఒకప్పుడు యువకులు, పోలీసు ఉద్యోగాలకు శిక్షణ తీసుకునే వారే మైదానాలు, వ్యాయామశాలలకు వచ్చేవారు. ప్రస్తుతం పెద్దవారు కూడా నడక బాట పడుతున్నారు. ఉదయం మైదానంలో నడక చేస్తూ సాయంత్రం జిమ్‌కు వెళ్తున్నారు.

మహిళల్లోనూ ఆసక్తి..

వ్యాయామశాలలకు గతంలో మగవారే ఎక్కువగా వెళ్లేవారు. మహిళల్లో నడకకు ఓటు వేస్తున్న వారు కన్నా.. వ్యాయామశాలలకు వెళ్తున్న వారు ఎక్కువ మంది ఉన్నారు. నగరంలో కొన్ని జిమ్‌లు కేవలం మహిళల కోసం ప్రత్యేకంగా ఉన్నాయి. మరికొన్నింటిలో ప్రత్యేకంగా సమయం కేటాయిస్తున్నారు. శిక్షకులను కూడా అతివలనే నియమిస్తున్నారు.

రోజుకో గంట..

ఉదయాన్నే తినాల్సిన టిఫిన్.. మధ్యాహ్నం, మధ్యాహ్న భోజనం సాయంత్రం తింటున్నారు. ఆహారంలో సమయపాలన లేకపోవడంతో ఎన్నో వ్యాధులు దరిచేరుతున్నాయి. ఫాస్ట్‌ఫుడ్స్ ఆహారం ఎక్కువగా తీసుకోవడంతో గ్యాస్, అధిక బరువు, ఆకృతి లేని శరీరంతో నగర జీవులు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో వైద్యుల సలహా మేరకు రోజుకు ఒక గంట వ్యాయామానికి కేటాయిస్తున్నారు. ఉదయం వీలు కాలేదంటే సాయంత్రం కష్టపడి చెమటోడ్చుతున్నారు. యువకులు శరీరాకృతి, పలకల దేహం కోసం నిత్యం జిమ్‌లోనే ఉంటున్నారు.


కరోనా తర్వాత దృష్టి



సొహైల్, వ్యాయామశాల శిక్షకులు

కరోనా తర్వాత జిమ్‌ల సంఖ్య పెరిగింది. ప్రతిఒక్కరూ వ్యాయామంపై దృష్టి పెడుతున్నారు. యువకులు శరీరాకృతితో పాటు ఆరు పలకల దేహం కోసం తహతహలాడుతున్నారు. కొందరు ఉదయం, సాయంత్రం వస్తున్నారు.

నిర్విరామంగా చేస్తున్నా



ప్రశాంత్‌రెడ్డి, వ్యాపారి

గత 20 సంవత్సరాల నుంచి నిర్విరామంగా వ్యాయామం చేస్తున్నాను. సరైన వ్యాయామంతో పాటు ఆహారపు అలవాట్లు మార్చుకుంటేనే ఆకృతి వస్తుంది. సమయానికి భోజనం తినడం, శిక్షకుల మెలకువలు పాటిస్తే కచ్చితంగా పలకల దేహం వస్తుంది. నిర్విరామంగా వ్యాయామం చేయాల్సిందే.

మానసిక ఒత్తిడి దూరం



సికిందర్, ప్రైవేటు ఉద్యోగి

నిత్యం జిమ్‌కు రావడం వల్ల ఎన్నో లాభాలు ఉన్నాయి. ఉద్యోగంలో ఒత్తిళ్లు, బాస్ ఆదేశాలు ఇలా ఒక్కటేమిటి ప్రతి విషయానికి వ్యాయామమే సమాధానమిస్తుంది. ముఖ్యంగా మానసిక ఒత్తిడి దూరమవుతుంది.

సమాచార స్రవంతి

బంగారం ధరలు

గ్రాము ధర: (3 శాతం జీఎస్టీ కలిపిన ధర)	రూ. 7,278
సవర ధర:	రూ. 58,224
వెండి (గ్రాము)	రూ. 96.00

వెంకాబ్ కోళ్ల ధరలు

బ్రాయిలర్ (రైతుధర)	115
రిటైల్	137
లేయర్	115
బ్రాయిలర్స్	199
బ్రాయిలర్స్ స్కిన్‌లెస్	226
లేయర్ మాంసం	195
నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్	
బ్రాయిలర్	125
లేయర్	110
బ్రాయిలర్స్	224
బ్రాయిలర్స్ స్కిన్‌లెస్	250
లేయర్ మాంసం	187

కుమారుడి మృతి.. తండ్రి అపస్మారక స్థితి

గుడ్లూరు, న్యూస్‌టుడే: ఆటోను ట్రాక్టరు ఢీకొట్టిన ప్రమాదంలో తీవ్రంగా గాయపడి కాలు కోల్పోయిన బాలుడు జె.అశోకచక్రవర్తి(12) సోమవారం తెల్లవారుజామున మృతి చెందాడు. కుటుంబ సభ్యులు అందించిన వివరాలిలా ఉన్నాయి. ఆదిమూర్తిపాలేనికి చెందిన అశోక చక్రవర్తి మరికొందరు ఆదివారం సాయంత్రం ఆటోలో వస్తుండగా గ్రామ సమీపంలో ఎదురుగా వస్తున్న ట్రాక్టరు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బాలుడి కాలు తెగిపడగా.. క్షతగాత్రుడిని ఒంగోలు ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడన్నారు. కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు సీఐ మంగారావు తెలిపారు.

నెల్లూరుకు తరలింపు: ఆటో ప్రమాదంలో బాలుడు మృతి చెందడంతో అతని తండ్రి పీటర్ అపస్మారక స్థితికి చేరుకున్నారు. దీంతో అతడిని నెల్లూరులో ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు.

న్యాయం చేయాలంటూ ధర్నా

సోమవారం సాయంత్రం బాలుడి మృతదేహానికి శవపరీక్ష నిర్వహించిన తర్వాత గ్రామానికి తీసుకొస్తుండగా గుడ్లూరు పోలీసుస్టేషన్ ముందు గ్రామస్థులు, బంధువులు మృతదేహం వాహనాన్ని అడ్డుకున్నారు. బాలుని మృతదేహాన్ని స్టేషన్ ముందు ఉంచి న్యాయం చేయాలంటూ నినాదాలు చేశారు. అదే సమయంలో పలువురు గ్రామస్థులు రహదారిని అడ్డుకుని ధర్నా చేయడంతో వాహనాలు నిలిచిపోయాయి. ట్రాక్టరు డ్రైవరు, యజమానిని స్టేషనుకు తీసుకురావాలని పెద్దఎత్తున స్టేషనులోకి చొచ్చుకొని పోయేందుకు ప్రయత్నించారు. గుడ్లూరు సీఐ మంగారావు, ఎస్సై వెంకటరావు, కందుకూరు, కావలి సీఐలు, డివిజన్‌లోని మండలాల ఎస్సైలు బందోబస్తు నిర్వహించారు. అనంతరం పోలీసులతో గ్రామస్థులు చర్చలు జరిపారు. రాత్రి తొమ్మిది గంటల వరకు చర్చలు కొనసాగుతున్నాయి.



పోలీస్‌స్టేషన్ ముందు రహదారిపై బైఠాయించిన గ్రామస్థులు

రైతేరాజు



బంతిపూల భాగ్యం

న్యూస్‌టుడే, వరికుంటపాడు

మెట్ట ప్రాంతం.. పైగా వర్షాభావం.. కరవుతో అల్లాడుతూ పొట్ట చేత పట్టుకొని వలస బాట పడుతున్నారు. గతంలో ఉద్యాన పంటలు వేయగా నీటి ఎద్దడితో ఎండిపోవడంతో చాలామంది వాటిని కొట్టేశారు. ఈపరిస్థితులను తట్టుకొని పూల తోట సాగు చేసి సిరులు కురిపిస్తున్నారు భోగ్యంవారిపల్లికి చెందిన మహిళా రైతు భోగ్యం గురుభాగ్యం. నూతన ఒరవడికి శ్రీకారం చుట్టారు. వారి కుటుంబానికున్న నాలుగెకరాల పొలంలో తొలుత 1.30 ఎకరాల్లో బంతి తోట వేశారు. వాతావరణం అనుకూలించి దిగుబడి బాగా వచ్చింది. నాలుగు డబ్బులు మిగిలాయి. దీంతో మరో 2.70 ఎకరాల్లో వేశారు.

సాగు ఇలా...

దుక్కి బాగా దున్నారు. సేంద్రియ ఎరువు వేసి భూమిని సారవంతం చేశారు. చిత్తూరు జిల్లాలోని వి.కోట నుంచి బంతి మొక్కలు తెప్పించి వేశారు. సేద్యం, ఎరువులు, మొక్కలు నాటడం, డ్రిప్‌తోపాటు పురుగుమందులు, కూలీలు తదితర ఖర్చులన్నీ కలిపి రూ. లక్ష వరకు అయ్యాయి. ఇప్పటికే రూ. 1.50 లక్షల వరకు రాబడి వచ్చింది. మరో రెండు నెలలపాటు దిగుబడి రానుంది. దాదాపు రూ. 2 లక్షల వరకు వస్తాయని ఈమె చెబుతోంది. గత ఏడాది గుమ్మడి వేయగా పెట్టుబడి పోను రూ. 2 లక్షలు మిగిలాయి. జాతీయ రహదారి అయినందున నిత్యం తోట వద్దనే పూలు మార్కెటింగు చేస్తున్నట్లు తెలిపారు. దీని తరువాత రోజా తోట వేస్తానని చెప్పారు.

సమస్య - సమాధానం

సమస్య: వరి సాగులో కర్బన శాతం పెరగాలంటే ఏంచేయాలి?
–సుబ్బయ్య, అల్లూరు

సమాధానం : పశువుల ఎరువు, పచ్చరొట్ట ఎరువుల ద్వారా పెరుగుతుంది

ప్రశ్న : బీపీటీ 5204 రకం అక్టోబరులో సాగు చేయవచ్చా? –రమేష్, అల్లూరుపేట

జవాబు : నీటి లభ్యత ప్రకారం నవంబరు మొదటి వారం లోపు వేసుకోవచ్చు.

ప్రశ్న : యంత్రం ద్వారా వరి నాట్లు వేస్తే ఫలితాలు ఎలా ఉంటాయి ?
–సుధాకర్, అల్లూరుపేట

జవాబు : వ్యయం తగ్గుతుంది. దిగుబడి పెరుగుతుంది.

ప్రశ్న : వేసవి దుక్కులతో ఉపయోగాలేమిటి? –కొండయ్య, నార్తుమోపూరు

జవాబు : భూమిలో ఉండే పైరుకు హాని కలిగించే పురుగులు నశిస్తాయి. వర్షం కురిస్తే నీరు భూమిలోకి బాగా వెళుతోంది.

(రైతుల సందేహాలకు వ్యవసాయాధికారిణి లలిత సమాధానాలు ఇచ్చారు.)
–న్యూస్‌టుడే, అల్లూరు



వరి చేను

ఎడగారు వరి.. లాభాలే

అల్లూరు, న్యూస్‌టుడే : ఎడగారు వరి సాగులో దిగుబడులు బాగా వచ్చాయి. ధాన్యం ధరలు ఆశాజనకంగా ఉండడంతో లాభాలు వచ్చాయని నార్తుఆములూరుకు చెందిన రైతు వెంకయ్య తెలిపారు. ఆయనకున్న మూడు ఎకరాల్లో ఎడగారు వరి సాగు మంచి ఫలితాలు సాధించారు. కేఎన్ఎమ్ 15068 రకాన్ని వేశారు. బావిలోని నీటిని పొదుపుగా వాడుకున్నారు. వ్యవసాయ శాఖ అధికారుల సిఫార్సు మేరకు రసాయన ఎరువులు, పురుగు మందులు వినియోగించారు. తెగుళ్లు ఇతర చీడపీడల సమస్య తగ్గింది. ఎకరాకు పెట్టుబడిగా రూ.22 వేలు అయ్యాయి. మూడు పుట్లు వరకు దిగుబడి వచ్చింది. పుట్టి రూ.19 వేలు చొప్పున విక్రయించారు. రూ.57 వేలు రాగా, ఇందులో పెట్టుబడి రూ.22 వేలు పోను రూ.35 వేలు నికరంగా మిగిలాయి. మూడు ఎకరాలపై సుమారు రూ. లక్షకు పైగా ఆదాయం వచ్చింది. ఎడగారు సాగుకు బావిలో నీటిని పొదుపుగా వాడుకోవడం ద్వారా పంట పండించినట్లు చెప్పారు.

మొలకశాతం బాగుంటేనే..

కావలి, న్యూస్‌టుడే: రబీ సేద్యానికి సిద్ధమవుతున్న రైతులు విత్తన నిర్వహణలో తగిన జాగ్రత్తలు పాటిస్తే మంచి దిగుబడి సాధించవచ్చని కావలి ఏడీఏ చల్లా నాగరాజు సూచించారు. ఇందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. ప్రభుత్వ అనుమతి ఉన్న దుకాణాల్లో కొనుగోలు చేసిన విత్తనాల్లో సుమారు వంద వంతున నానబెట్టి వస్త్రంలో చుట్టాలి. రెండురోజుల్లో అందులో 90 శాతం వరకు మొలకెత్తితేనే మేలైన విత్తనంగా భావించాలి. అలా కాకుండా 80 శాతం కంటె తక్కువగా మొలకెత్తితే వాటిని వినియోగించకపోవడం శ్రేయస్కరం. బస్తాలను సీళ్లు తీయకుండా ఏదైనా ఇనుప చువ్వ ద్వారా రంధ్రం వేసి నమూనా నిమిత్తం విత్తనాలు సేకరించాలి. మొలక సరిగా రాకుంటే తిరిగి వాపసు చేసేందుకు వీలుంటుంది. ఎంపిక పూర్తైన తరువాత విత్తన శుద్ధి కూడా చాలా కీలకం. విత్తనాలు, గాలి కారణంగా కూడా వివిధ తెగుళ్లు సోకే అవకాశం ఉంటుంది. ఇందుకోసం సుడోమోనాస్ లేక బావిస్టిన్‌ను విత్తనశుద్ధి నిమిత్తం వినియోగించవచ్చు.



డ్రాగన్ పండు లాభాలు మెండు

చేజర్ల, న్యూస్‌టుడే: తక్కువ నీటితో రైతులకు మంచి లాభాలను తెచ్చిపెడుతోంది డ్రాగన్ ఫ్రూట్. ఉద్యాన, ఉపాధి హామీ విభాగాలు పెట్టుబడి ఖర్చు లేకుండా సాయం చేస్తూ ప్రోత్సహిస్తున్నాయి. మార్కెట్లో మంచి గిరాకీ ఉన్న డ్రాగన్ ఫ్రూట్ సాగు రైతులకు లాభదాయకంగా మారింది. జిల్లాలోని పొదలకూరు, ఆత్మకూరు సబ్ డివిజన్లలో ప్రయోగాత్మకంగా తోటలు వేసిన రైతులు లాభాల పంట పండిస్తున్నారు. నిమ్మ, మామిడి, జామ కన్నా తక్కువ శ్రమతో సాగు చేయవచ్చని రైతులు చెబుతున్నారు. ఎకరం సాగుకు రూ. నాలుగు నుంచి అయిదు లక్షల వరకు ఖర్చవుతుంది. మొదటి మూడు సంవత్సరాల్లో కొద్దిపాటి దిగుబడి వస్తోంది. నాలుగో ఏడాది నుంచి పెరుగుతోంది. దీని సాగుకు రూ. రెండు లక్షల వరకు పెట్టుబడిగా ఇస్తున్నట్లు డ్వామా పీడీ శ్రీనివాసులు తెలిపారు.

జాగ్రత్తలు అవసరం

-బి. వెంకయ్య, అంకిరెడ్డిపాలెం, పొదలకూరు మండలం

సాగులో జాగ్రత్తలు తీసుకోవాలి. లేకుంటే పెట్టుబడి అధికంగా ఉంటుంది. పెద్ద పరిమాణంలో కాయ లభిస్తే నాణ్యమైన మొక్కలు ఎంపిక చేసుకోవాలి. తొందరగా ఫలసాయం పొందాలని రసాయన ఎరువులు వాడితే మొక్కల్లో సున్నితత్వం పెరిగి తోట జీవిత కాలం తగ్గుతోంది. సస్యరక్షణకు ఎలాంటి రసాయనాలు వాడాల్సిన అవసరం రాలేదు. వేసవిలో నీటి తడులు తక్కువగా ఇవ్వాలి. పండించిన పండ్లను సకాలంలో కోసి అమ్ముకొనే అవకాశాలు పెంచుకోవాలి.

గంజాయితో పట్టుబడిన నెల్లూరు యువకులు

కొణిజర్ల, న్యూస్‌టుడే: ఖమ్మం జిల్లా కొణిజర్ల మండలం పల్లిపాడు వద్ద గుట్టుచప్పుడు కాకుండా తరలిస్తున్న గంజాయిని ఆబ్కారీ అధికారులు సోమవారం పట్టుకున్నారు. పల్లిపాడు వద్ద ఆర్టీసీ బస్సులను నిలిపి సీఐ మమత, ఎస్సై సాయిరాం ఆధ్వర్యంలో సిబ్బంది తనిఖీ చేస్తున్నారు. ఈ విషయం గమనించిన ముగ్గురు యువకులు భద్రాచలం నుంచి ఖమ్మం వస్తున్న ఆర్టీసీ బస్సు నుంచి దిగి అనుమానాస్పదంగా బయట తిరుగుతున్నారు. ఆబ్కారీ అధికారులు వారిని అదుపులోకి తీసుకుని విచారించి వారి వద్దనున్న బ్యాగ్‌ల్లో నుంచి 8.5 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. గంజాయి తరలిస్తున్న చంద్రబాబు, అఫ్రోజ్, అజీబ్ నెల్లూరుకు చెందిన బీటెక్ విద్యార్థులుగా గుర్తించామని, వారిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

బలమైన శక్తిగా రైల్వే ఎంప్లాయీస్ సంఘ్

బిట్రగుంట, న్యూస్‌టుడే: రైల్వే కార్మిక సంఘాల గుర్తింపు ఎన్నికల్లో ఎంప్లాయీస్ సంఘ్ బలమైన శక్తిగా అవతరించబోతుందని విజయవాడ రైల్వే డివిజినల్ ఎంప్లాయీస్ సంఘ్ కార్యదర్శి ఆమంచి వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. సోమవారం బిట్రగుంట బ్రాంచి ఛైర్మన్ పులిందల గోవిందరాజులు, కార్యదర్శి రాజశేఖర్ తదితరులతో కలిసి రైల్వే కార్యాలయంలోని అధికారులు, కార్మికులను కలసి తమ యూనియన్ గుర్తింపు కోసం ఓటు వేయాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిసెంబరు 4, 5, 6 తేదీల్లో పోలింగ్ ఉంటుందన్నారు. ఆయన వెంట విజయవాడ అడిషనల్, డివిజనల్ కార్యదర్శి జి.శ్రీనివాసులు, జీవన్‌కుమార్ తదితరులు ఉన్నారు.



ప్రచారంలో విజయవాడ రైల్వే డివిజనల్ ఎంప్లాయీస్ సంఘ్ కార్యదర్శి వెంకటేశ్వరరావు

కారణాలు లేకుండా అర్జీలు తిరస్కరించొద్దు

నెల్లూరు(కలెక్టరేట్), న్యూస్‌టుడే: ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో వచ్చిన అర్జీల రీఓపెన్ కేసులపై పత్యేక దృష్టి పెట్టాలని కలెక్టర్ ఒ.ఆనంద్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తులపై సమీక్షించారు. అనంతరం అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో 251 అర్జీలు రీ ఓపెన్ అయ్యాయని తెలిపారు. అర్జీదారులతో మాట్లాడి సమస్య ఎందుకు పరిష్కారం కాలేదో వివరించాలన్నారు. సరైన కారణాలు లేకుండా అర్జీలు తిరస్కరించవద్దని సూచించారు. జిల్లాలో ప్రభుత్వ కోర్టు కేసులపై అధికారులు స్పందించాలన్నారు. వీటికి సంబంధించిన వివరాలు ఆన్‌లైన్‌లో పొందుపరచాలని తెలిపారు. కోర్టు కేసుల పరిష్కారంపై జిల్లా, మండల అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ప్రజల నుంచి 330 అర్జీలు వచ్చాయని, నిర్ణీత గడువులోగా పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో జేసీ కార్తీక్, డీఆర్వో లవన్న, జడ్పీ సీఈవో ఖాదర్‌వలి, డీపీవో సుస్మితారెడ్డి, డ్వామా పీడీ బి.గంగాభవాని, గృహ నిర్మాణశాఖ పీడీ టి.వేణుగోపాల్, డీఎంహెచ్‌వో డాక్టర్ పెంచలయ్య, ఉద్యానవన శాఖ అధికారి సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ ఆనంద్, అధికారులు

జాహ్నవికి జిల్లా ప్రథమ స్థానం

ఉలవపాడు, న్యూస్‌టుడే: జిల్లా స్థాయిలో సెప్టెంబరు 30న జరిగిన వ్యాసరచన పోటీల్లో పెద్దపట్టపుపాలెం విద్యార్థిని ఆవల జాహ్నవి ప్రథమ స్థానం సాధించినట్లు ప్రధానోపాధ్యాయులు సలీంబాషా తెలిపారు. వికసిత్ భారత్ 2047 నాటికి ట్రిలియన్ ఆర్థిక వ్యవస్థగా మార్చాలని గ్రామ, మండల స్థాయిల్లో జరిగిన పోటీల్లోనూ ఈమె ప్రతిభ కనబరిచారు. ఈమెను ఉపాధ్యాయులు అభినందించారు.

ఎక్సైజ్ శాఖలో బదిలీలు

నెల్లూరు(నేర విభాగం), న్యూస్‌టుడే: జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖలో 16 మంది ఎస్సైలు, ఉమ్మడి జిల్లాలో 22 మంది హెడ్ కానిస్టేబుళ్లు, 155 మంది కానిస్టేబుళ్లను బదిలీ చేస్తూ జిల్లా డిప్యూటీ కమిషనర్ టి.శ్రీనివాసరావు ఉత్తర్వులు జారీ చేశారు. ఎస్‌ఐలు ఎస్.ప్రభాకర్ రావు, జీకేవీఎన్ మురళీకృష్ణ, డి.శ్రీధర్ నెల్లూరు-1, ఎన్.శకుంతలా దేవి, ఎస్‌డీ మునీర్ అహ్మద్ నెల్లూరు-2, ఒ.ప్రతాప్ కుమార్, షేక్ మహబూబ్ బాషా కోవూరు, కె.హరిబాబు ఇందుకూరుపేట, రేవతి కందుకూరు, ఎం.దేవిక కావలి, దీప్తిక్రాంత్ ఉదయగిరి, ఎం.అంజయ్య పొదలకూరు, సీహెచ్ పూర్ణకుమార్, ఎస్‌డీ కాలేషా వలి ఏసీ ఎన్‌ఫోర్స్‌మెంట్, కేవీఆర్ ఆంజనేయులు పీఅండ్ఈ ఎస్‌టీఎఫ్, ఎండీ ఆసిఫ్ బేగ్ ఐఎంఎల్ డిపో దేవరపాలెంకు బదిలీలు చేస్తూ ఆదేశాలు జారీ చేశారు.

చాకలకొండ రైతు డిపోలో విజిలెన్స్ అధికారుల తనిఖీ

వింజమూరు, న్యూస్‌టుడే : మండలంలోని చాకలకొండలో విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు సోమవారం కార్తికేయ రైతు డిపోలో తనిఖీలు నిర్వహించారు. ఎరువుల అమ్మకాల్లో తేడాలు కనిపించడంతో పాటు బిల్లులు ఇవ్వకుండా విక్రయాలు జరుపుతున్నట్లు గుర్తించారు. రూ. 2.96 లక్షల విలువైన 15.25 టన్నుల ఎరువులను సీజ్ చేశారు. నిత్యావసరాల సరకుల చట్టం ప్రకారం 6ఏ కేసు నమోదు చేసినట్లు విజిలెన్స్ వ్యవసాయాధికారి శివనాగప్రసాద్ తెలిపారు. దాడుల్లో విజిలెన్స్ హెడ్‌కానిస్టేబుల్ హరికృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామ బహిష్కరణపై ఫిర్యాదు

నెల్లూరు(కలెక్టరేట్), న్యూస్‌టుడే: అప్పు విషయమై గ్రామంలో పది కుటుంబాలను బహిష్కరించారని ముత్తుకూరు మండలం మధురానగర్ గ్రామానికి చెందిన కోటేశ్వరరావు, బాబు, శ్రీనివాసులు, నరేష్, వినోద్ సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. తహసీల్దారు, ఎస్సై, సీఐ, డీఎస్పీ ఆధ్వర్యంలో ఇటీవల సమావేశం ఏర్పాటు చేశారని, బహిష్కరించడం చట్టరీత్యా నేరమని తెలిపి.. సమస్యను పరిష్కరించకుండా గ్రామంలోకి వెళ్లి పంచాయితీ చేసుకోండని పంపించారని తెలిపారు. గ్రామంలో ఉండాలంటే ప్రతి ఒక్కరూ గ్రామ పెద్దల కాళ్లమీద పడి క్షమాపణ కోరి వేడుకోవాలని, అందరూ కలిసి రూ.10లక్షలు జరిమానా కడితేనే గ్రామంలోకి రానిస్తామని గ్రామానికి చెందిన కొందరు పెద్దలు చెబుతున్నట్లు వాపోయారు. న్యాయం చేయాలని కోరారు.



ఆశాజీవులు

అంధులం సార్.. ఆదుకోండంటూ జిల్లాలకు చెందిన పలువురు దివ్యాంగులు సోమవారం కలెక్టరేకు తరలివచ్చారు. బ్యాక్‌లాక్ పోస్టులు భర్తీ చేయాలని అంధులు.. పింఛన్లు అందించాలని దివ్యాంగులు.. ఇలా పలువురు ఒకరిచేయి ఒకరు పట్టుకుని వచ్చి అధికారుల వద్ద మొరపెట్టుకున్నారు. కూటమి ప్రభుత్వంలోనైనా భరోసా కల్పించాలని వేడుకున్నారు. కళ్లు కన్పించకపోయినా తమ బాధలు తీరుతాయన్న ఆశతో ఒకరికొకరు తోడుగా వచ్చి అధికారులకు అర్జీలు అందించారు. – న్యూస్‌టుడే, నెల్లూరు(కలెక్టరేట్)

ఇవి నీలగిరులా!

ఈచిత్రం చూశారా... ఇవి ఎక్కడో ఊటీలోని దృశ్యాలనుకుంటున్నారా.. కాదండి. ఉదయగిరి నుంచి సీతారామపురం వెళ్లే మార్గంలో సోమవారం కనిపించాయి. మేఘాలు కొండలను తాకుతూ వెళుతూ చూపరులను ఆకట్టుకున్నాయి. ఈ ఆహ్లాదకర దృశ్యాలు 'న్యూస్‌టుడే' తన కెమెరాలో బంధించింది. – సీతారామపురం, న్యూస్‌టుడే



లారీకి విద్యుత్తు షాక్.. క్లీనరు మృతి

ఉలవపాడు, న్యూస్‌టుడే: సరివి కలప తరలిస్తున్న లారీని విద్యుత్తు తీగలు తాకడంతో కరెంటు సరఫరా అయి ఒకరు మృతిచెందిన సంఘటన మన్నేటికోట వద్ద జరిగింది. ఎస్సై అంకమ్మ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఉలవపాడులోని హైస్కూల్ సంఘానికి చెందిన గుంటక **సూర్యనారాయణ** (47) లారీ క్లీనరు. కలప లారీ మన్నేటికోట వెళ్లి తిరిగొస్తుండగా.. రోడ్డు క్రాస్ చేస్తున్న సమయంలో తీగలు తాకి లారీకి కరెంటు సరఫరా అయింది. దీంతో క్యాబిన్‌లో ఉన్న కూలీలు దూకేయడంతో ప్రాణాలతో బయటపడ్డారు. క్లీనర్ సూర్యనారాయణ ఇనుపకడ్డీ పట్టుకోవడంతో షాకుకు గురై మృతిచెందాడు. మృతదేహన్ని పోస్టుమార్టం కోసం ఆసుపత్రికి తరలించారు. సూర్యనారాయణకు భార్య ముగ్గురు, మగపిల్లలున్నారు.





జిల్లాలో మెరిసి.. రాష్ట్ర స్థాయిపై గురి

కందుకూరు పట్టణం, న్యూస్‌టుడే: విద్యార్థి దశలోనే లక్ష్యాలను నిర్దేశించుకుని తమ కలలను సాకారం చేసుకునేందుకు అడుగులు వేస్తున్నారు టీఆర్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థినులు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో చదువుతూ ఉన్న అరకొర వనరులను సద్వినియోగం చేసుకుని ఒక్కో మెట్టు ఎక్కుతూ ప్రశంసలు అందుకుంటున్నారు. సెప్టెంబరు 17నుంచి 30వరకు టీఆర్ఆర్ కళాశాల మైదానంలో ఉమ్మడి ప్రకాశం జిల్లా స్థాయి బాలుర, బాలికల జట్లను ఎంపిక చేశారు. హాకీ, బాస్కెట్‌బాల్, హ్యాండ్‌బాల్, కబడ్డీ, క్రికెట్ రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించారు.

క్రీడా కోటాలో ఉద్యోగ సాధనకు అనుష్క కృషి




కందుకూరు మండలం పందలపాడుకు చెందిన వి.కోటేశ్వరరావు, ప్రమీల దంపతుల కుమార్తె అనుష్క. టీఆర్ఆర్ కళాశాలలో ఎంపీహెచ్‌డబ్ల్యూ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. తల్లిదండ్రులు కూలీలు. క్రీడా కోటాలో ప్రభుత్వ ఉద్యోగం సాధించవచ్చని గురువులు చెప్పడంతో అనుష్క గత రెండేళ్ల నుంచి హ్యాండ్‌బాల్ సాధన చేస్తోంది. ప్రస్తుతం అండర్-19 జిల్లా బాలికల జట్టుకు ఎంపికైంది.

బాల్యం నుంచే ఆటలపై లావణ్యకు ఆసక్తి



చీరాలకు చెందిన పి.సురేష్, అంజమ్మ కుమార్తె లావణ్య. టీఆర్ఆర్‌లో బైపీసీ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. తండ్రి ఫిషర్‌మెన్, తల్లి కూలీ. లావణ్యకు చిన్నప్పటి నుంచి క్రీడలంటే ఆసక్తి. టీఆర్ఆర్‌లో క్రీడలకు ప్రాధాన్యమిస్తారని తెలిసి ఇంటర్మీడియట్ కందుకూరులో చదివింది. ప్రస్తుతం కబడ్డీ జిల్లా జట్టుకు ఎంపికైంది. అక్టోబరు 6 నుంచి జరగబోయే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొననుంది.

ఉపాధ్యాయురాలు కావాలని శిరీష ఆకాంక్ష



పొందూరుకు చెందిన డి.మోజేష్, దయమ్మల కుమార్తె శిరీష. టీఆర్ఆర్‌లో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. తల్లిదండ్రులు బేల్దారి కూలీలు. శిరీషకు చిన్నప్పటి నుంచి క్రీడలంటే ఆసక్తి. గతేడాది హ్యాండ్‌బాల్ రాష్ట్ర స్థాయి పోటీల్లో ద్వితీయ స్థానం సాధించింది. ప్రస్తుతం హ్యాండ్‌బాల్ జిల్లా జట్టుకు ఎంపికైంది. భవిష్యత్తులో ఉపాధ్యాయురాలు కావాలనేది ఈమె ఆకాంక్ష.

తల్లిదండ్రుల స్ఫూర్తితో ఎస్తేరు ముందడుగు



అద్దంకి మండలం ధర్మవరానికి చెందిన కె.అంజయ్య, రెబ్కాల కుమార్తె ఎస్తేరు. టీఆర్ఆర్‌లో ఎంపీహెచ్‌డబ్ల్యూ చదువుతోంది. తల్లిదండ్రులు బేల్దారి కూలీలు. ప్రస్తుతం కబడ్డీ జిల్లా జట్టుకు ఎంపికైంది. త్వరలో అన్నమయ్య జిల్లాలో జరగబోయే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొననుంది. గతేడాది రాష్ట్ర స్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో ద్వితీయ స్థానం సాధించింది.

కావలి

• కావలి • ఉదయగిరి • కందుకూరు

తాగునీటి సమస్యకు పరిష్కారం : ఎమ్మెల్యే

వింజమూరు, న్యూస్‌టుడే : ఉదయగిరి నియోజకవర్గంలో 143 పంచాయతీల్లో తాగునీటి సమస్య పరిష్కారం లక్ష్యంగా చర్యలు తీసుకోవాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు ఎమ్మెల్యే కాకర్ల సురేష్ సూచించారు. ఆ శాఖ అధికారులతో నెల్లూరు లోని తన క్యాంపు కార్యాలయంలో సోమవారం సమావేశం నిర్వహించారు. జలసిరి, ఎన్టీఆర్ సుజల స్రవంతి పథకాలపై సమీక్షించారు. కార్యక్రమంలో ఈఈ రాధయ్య, వింజమూరు డీఈ బి.భావనారాయణ, ఏఈలు పాల్గొన్నారు.

అర్జీల స్వీకరణ

కందుకూరు పట్టణం, న్యూస్‌టుడే: ప్రతి సోమవారం జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని పట్టణ ప్రజలు వినియోగించుకోవాలని మున్సిపల్ కమిషనర్ కె.అనూష కోరారు. ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఇంజినీరింగ్, పట్టణ ప్రణాళిక, పారిశుద్ధ్యం, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

ప్రజలతో మమేకమైతే లక్ష్యాల సాధన



బీపీఎంకు బహుమతి అందజేస్తున్న సూపరింటెండెంట్ శ్రీనివాస్

ఉదయగిరి, న్యూస్‌టుడే : తపాలా ఉద్యోగులు ప్రజలతో మమేకమై నిర్దేశించిన లక్ష్యాలను సాధించాలని ఆ శాఖ నెల్లూరు డివిజన్ సూపరింటెండెంట్ కె.శ్రీనివాస్ పేర్కొన్నారు. ఉదయగిరి సబ్ డివిజన్ కార్యాలయంలో సోమవారం ఉద్యోగులతో సమావేశమయ్యారు. ఇండియా పోస్ట్ పేమెంట్ బ్యాంకు ఖాతాల ద్వారా గ్రూపు యాక్సిడెంట్ పాలసీలు విరివిగా చేయాలన్నారు. బీమా పాలసీలు, ఖాతాల ప్రారంభంలో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన బీపీఎంలకు సిల్వర్ కాయిన్లు అందజేశారు. కార్యక్రమంలో ఐపీఓ సాయికృష్ణారెడ్డి, మెయిల్ ఓవరీర్స్ రామకృష్ణారెడ్డి, మోహన్, ఎస్‌పీఎంలు అనిల్, నజీర్‌బాషా, తిరుపాలయ్య, నరసయ్య, గౌరబ్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక

బిట్రగుంట, న్యూస్‌టుడే: బోగోలు మండలం విశ్వనాథరావుపేటలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థినులు వివిధ క్రీడల్లో ప్రతిభ కనబరిచి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. సోమవారం వారిని పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు గంగాధర్, పీఈటీ రేణుక అభినందించారు. 400 మీటర్ల పరుగుకు పి.భార్గవి, డిస్క్‌త్రోకు బి.ఆలీషా, ఖోఖోకు బి.భువనేశ్వరి, వాలీబాల్‌కు టి.పావని, 600 మీటర్ల పరుగుకు ఎస్కే జాకీరా, యోగాలో ఎస్తేరా రాణి, నిషిత ఎంపికయ్యారు. **ఉలవపాడు :** మండలంలోని పెద్దపట్టపుపాలెం విద్యార్థులు 43 మంది నియోజకవర్గ స్థాయి పోటీలకు ఎంపికయినట్లు ప్రధానోపాధ్యాయులు సలీంబాషా తెలిపారు. అండర్-14, అండర్-17 విభాగాల్లో షార్ట్‌పుట్, జావెలిన్‌త్రో, డిస్కస్‌త్రో, రన్నింగ్, జంపింగ్, వాలీబాల్, కబడ్డీ పోటీలకు ఎంపికయ్యారు. వీరిలో 34 మంది జిల్లా స్థాయికి కూడా ఎంపికయ్యారు. వీరిని పీడీ బాలయ్య, ఉపాధ్యాయులు అభినందించారు.

పోటీ పరీక్షలతో ప్రతిభకు పదును

సీతారామపురం : పోటీ పరీక్షలతో ప్రతిభ వెలుగులోకి వస్తుందని ఎంఈవో మస్తాన్‌వలి తెలిపారు. సీతారామపురంలోని ఆదర్శ పాఠశాలలో మండల స్థాయి వరల్డ్ స్పేస్ వీక్ క్విజ్ పోటీలు సోమవారం నిర్వహించారు. కార్యక్రమంలో ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్ రెహమాన్ పాల్గొన్నారు. **కావలి :** పోటీతత్వంతో రాణిస్తేనే ప్రతిభావంతులుగా నిలుస్తారని మండల విద్యాధికారి బండి గోవిందయ్య తెలిపారు. మండల స్థాయి క్విజ్ పోటీలు నిర్వహించారు. **గుడ్లూరు :** విద్యార్థి దశ నుంచే అంతరిక్షంపై అవగాహన ఉండాలని ఎంఈవో గోవర్ధన్ అన్నారు. స్థానిక ఉన్నత పాఠశాలలో క్విజ్ పోటీలు నిర్వహించారు. **కొండాపురం:** ఎంఈవో కార్యాలయంలో విద్యార్థులకు క్విజ్ పోటీ పరీక్షలను ఉపాధ్యాయులు నిర్వహించారు. వరల్డ్ స్పేస్‌కు సంబంధించి విద్యార్థులకు పోటీలు నిర్వహించామని ఎంఈవో-2 ఆనందరావు తెలిపారు. **లింగసముద్రం :** లింగసముద్రం ఉన్నత పాఠశాలలో మండల స్థాయిలో క్విజ్ పోటీలు నిర్వహించినట్లు ఎంఈవో-2 శివకుమార్ తెలిపారు. ప్రధానోపాధ్యాయుడు యు.మాధవరావు పాల్గొన్నారు.

పల్లెటూరి పిల్లలు.. క్రీడల్లో పిడుగులు



ఆడుతున్న పిల్లలు

న్యూస్‌టుడే, దగదర్తి, కావలి

పల్లెల్లోని పేద, మధ్యతరగతి కుటుంబాలు పుట్టారు.. తల్లిదండ్రులు పిల్లల ఉన్నతి కోసం శ్రమిస్తున్నారు. కష్టపడి చదివిస్తున్నారు. కన్న వారి శ్రమను వృథా చేయకుండా చక్కగా చదువుకుంటున్నారు. మరోవైపు ఇష్టమైన క్రీడల్లో సాధన చేస్తున్నారు. నైపుణ్యం సాధించారు. పోటీల్లో పతకాలు సాధిస్తున్నారు. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఊరికి, చదువుకుంటున్న పాఠశాలకు గుర్తింపు తెచ్చారు దగదర్తి మండలంలోని దుండిగం ఉన్నత పాఠశాల విద్యార్థులు భార్గవి, బాలాజీ. వీరిని ప్రధానోపాధ్యాయుడు ప్రకాశం బాబు, వ్యాయామ ఉపాధ్యాయుడు అర్జున్‌సింగ్ అభినందించారు.

వసతులు లేకున్నా..

క్రీడల్లో సాధన చేసేందుకు పాఠశాలలో పెద్దగా సౌకర్యాలు లేవు. ఆటస్థలం బాగా లేకున్నా ఇష్టంగా సాధన చేశారు. మైదానం అధ్వానంగా తయారైంది. పరుగు తీయాలంటే వీలు కాని స్థితి. అయినా క్రీడల్లో రాణించాలన్న లక్ష్యంతో శ్రమించారు. ఆటల్లో పట్టు సంపాదించారు. ఎక్కడ పోటీలు జరిగినా వెళ్లారు. పతకాలు సాధించారు. రాష్ట్ర స్థాయిలో గుర్తింపు తెచ్చుకున్నారు.

ఖోఖో ఆటపై ఆసక్తి



దుండిగం గ్రామానికి చెందిన రైతు బ్రహ్మయ్య కుమార్తె **భార్గవి** చదువుతో పాటు క్రీడల్లో రాణిస్తోంది. ఆమె స్థానిక ఉన్నత పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతోంది. తల్లిదండ్రులతో పాటు వ్యాయామ ఉపాధ్యాయుడు అర్జున్‌సింగ్ ప్రోత్సాహంతో ఖోఖో ఆటపై ఆసక్తి పెంచుకుని శిక్షణ తీసుకుంది. పాఠశాలలో క్రీడా వసతులు కరవైనా కఠోర సాధన చేసింది. నెల్లూరులోని ఎ.సి. సుబ్బారెడ్డి స్టేడియంలో ఇటీవల జరిగిన ఎస్‌జీఎఫ్ఐ 14 సంవత్సరాల లోపు బాలికల విభాగంలో ఖోఖో ఆటలో ప్రతిభ చూపి రాష్ట్ర జట్టుకు ఎంపికైంది. పల్నాడులో జరగనున్న బాలికల విభాగంలో రాష్ట్ర స్థాయిలో జరిగే ఖోఖో పోటీలో ఆడేందుకు కసరత్తు చేస్తోంది. గత ఏడాది జిల్లా స్థాయి పోటీల్లో జట్టు విజయంలో కీలక పాత్ర పోషించింది.

కర్షకుడి కుటుంబంలో క్రీడా కెరటం



దుండిగంలోని వ్యవసాయ కుటుంబానికి చెందిన శ్రీనివాసులు కుమారుడు **బాలాజీ** చిన్ననాటి క్రీడలపై ఆసక్తి పెంచుకున్నాడు. స్థానిక ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాడు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ప్రోత్సాహంతో క్రీడల్లో సత్తా చాటుతున్నాడు. పోల్‌వాల్ట్ క్రీడలో నైపుణ్యం సాధించాడు. నెల్లూరులోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో ఇటీవల జరిగిన అథ్లెటిక్స్ పోటీల్లో 17 సంవత్సరాల లోపు విభాగంలో పోల్‌వాల్ట్ పోటీలో జిల్లా స్థాయిలో ప్రథమ స్థానం సాధించి రాష్ట్ర జట్టుకు ఎంపికయ్యాడు. త్వరలో శ్రీకాకుళంలో జరిగే పోటీల్లో ఆడేందుకు శిక్షణ తీసుకుంటున్నాడు. గత ఏడాది గుంటూరులో జరిగిన పోటీల్లో ద్వితీయ స్థానం సాధించాడు. రెండేళ్ల క్రితం జిల్లా స్థాయి పోటీల్లో మొదటి స్థానంలో నిలిచాడు.

బిట్రగుంట : బోగోలు మండలంలోని విశ్వనాథరావుపేట జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన గుంజి లతికది మధ్యతరగతి కుటుంబం. తొమ్మిదో తరగతి చదువుతోంది. తండ్రి విజయకుమార్ చిరుద్యోగి. తల్లి ఏంజెల్ గృహిణి. ఈమెకు చిన్నప్పటి నుంచి క్రీడలంటే మక్కువ. కబడ్డీ, డిస్క్‌త్రో వంటి క్రీడల్లో రాణిస్తోంది. బాక్సింగ్‌లో టాపర్‌గా పేరు తెచ్చుకుంది. రాష్ట్ర స్థాయిలో జరిగే పోటీల్లో పాల్గొనేందుకు ఎంపికైంది. తల్లిదండ్రులు, ప్రధానోపాధ్యాయుడు గంగాధర్, పీఈటీ రేణుక ప్రోత్సాహకంగా నిలుస్తున్నారు. భవిష్యత్తుల్లో ఏరోనాటికల్ ఇంజినీర్ కావాలనే లక్ష్యంతో శ్రమిస్తోంది. బాక్సింగ్‌లో అంతర్జాతీయ స్థాయి వరకు వెళ్లాలనే పట్టుదలతో ఉంది.



అభినందిస్తున్న హెచ్‌ఎం గంగాధర్, చిత్రంలో పీఈటీ

మేమున్నాం.. మీకు తోడుగా!

(10 AM to 1 PM) కావలి : 80080 51666, 91548 46698
కందుకూరు:70939 81624, ఉదయగిరి : 80085 73944

సమస్య : పట్టణంలోని అన్న క్యాంటీన్‌లో ఆహార పదార్థాలు రుచికరంగా ఉండడం లేదు. అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు. **- జ్యోతి బాబురావు, అంబేడ్కర్‌నగర్ కాలనీ**

సమాధానం : ఆహార పదార్థాలను పరిశీలిస్తాం. మార్గదర్శకాలకు అనుగుణంగా ఉండేలా చర్యలు తీసుకుంటాం. **- సాయిరాం, నోడల్ అధికారి, అన్న క్యాంటీన్, కావలి.**

? గ్రామంలోని ర.భ రోడ్డు పక్క మురుగు నీటి కాలువ ప్లాస్టిక్ వ్యర్థాలతో పూడుకుపోవడంతో మురుగునీరు పారక దుర్వాస వెదజల్లుతుంది.. **- టి.మల్లికార్జున, జలదంకి**

✓ పూడిక తీయించి మురుగు ప్రవహించేలా చర్యలు తీసుకుంటాం. **- ఖాజాముహిద్దీన్, పంచాయతీ కార్యదర్శి, జలదంకి, న్యూస్‌టుడే**

? మా గ్రామంలో కాలువలు లేక రోడ్డు మీదకు మురుగు చేరుతోంది. -రామయ్య, బట్రకాగొల్లు

✓ పరిశీలించి చర్యలు తీసుకుంటాం. **- పెంచల వీరబాబు, ఈవోపీఆర్డీ - అల్లూరు, న్యూస్‌టుడే**

సమస్యల పరిష్కారానికి కృషి

దగదర్తి : ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు చిత్తశుద్ధితో కృషి చేయాలని తెదేపా రాష్ట్ర ఉపాధ్యక్షుడు సుబ్బానాయుడు కోరారు. సోమవారం దగదర్తిలో జరిగిన ప్రజా విజ్ఞప్తుల దినంలో పాల్గొని ప్రజల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. గృహనిర్మాణ లబ్ధిదారులకు సత్వరమే బిల్లులు చెల్లించాలని ఆ శాఖ ఏఈ హేమంత్‌ను కోరారు.

వర్షా కాలంలో ఎండమావులు

భానుడు ఉగ్రరూపం చూపిస్తున్నాడు. దీంతో ఎండా కాలం నడుస్తుందా అన్నట్లుగా ఉంది. ఎండలతో రహదారిపై ఎండమావులు దర్శనమిస్తున్నాయి. ఉదయగిరి-వింజమూరు మార్గంలోని జాతీయరహదారిపై సోమవారం మధ్యాహ్నం భానుడి ప్రభావం కారణంగా ఎండమావులు దర్శనమిచ్చాయి. **– న్యూస్‌టుడే, సీతారామపురం**



విద్యార్థులతో మమేకమైతే గుర్తింపు

పాఠశాలలో విధులు నిర్వహించే సిబ్బంది విద్యార్థులతో మమేకమై పని చేసినప్పుడే మంచి గుర్తింపు తెచ్చుకుంటారని మాచవరం ఉన్నత పాఠశాల హెచ్‌ఎమ్ జి.మాల్యాద్రి అన్నారు. బదిలీపై వెళ్తున్న జూనియర్ సహాయకుడు జి.తేజని సోమవారం స్థానిక పాఠశాలలో ఉపాధ్యాయులతో కలిసి సన్మానించారు. **– న్యూస్‌టుడే, కందుకూరు గ్రామీణం**



ఓపీ చీటీ.. నిరీక్షణతో నీరసమొచ్చి!



చిత్రంలోని వ్యక్తి పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలలో సోమవారం ఓపీ స్లిప్పులు తీసుకోవడానికి వచ్చి నిరీక్షించలేక ఇలా నేలపై పడుకున్న వృద్ధుడు. భారీగా రోగులు రావడంతో చీటీలు రాయడంలో ఆలస్యమవుతోంది. ఈసమయంలో క్యూలో నిలబడలేక ఇలా పడుకున్నారు. గంటసేపు నిరీక్షిస్తేగాని చీటీ చేతికందడం లేదు. ఆ తరువాత వైద్యుడి వద్దకు వెళ్లాలి. నిత్యం 500 మంది వరకు రోగులు ఓపీ వైద్య సేవలకు వస్తుంటారు. దీనిపై ఆసుపత్రి ఆర్‌ఎంవో ప్రమీల మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా కార్డుపై వివరాలు నమోదు చేయాల్సి రావడంతో జాప్యమవుతుందన్నారు. మరో కౌంటర్ ఏర్పాటుకు ప్రయత్నిస్తున్నామని వివరించారు. **– న్యూస్‌టుడే, కావలి**

పవన్ దీక్షకు సంఘీభావం



పూజలు చేస్తున్న సుధాకర్ తదితరులు

కావలి : ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ చేపట్టిన ప్రాయశ్చిత దీక్షకు సంఘీభావంగా జనసేన పార్టీ కావలి బాధ్యుడు అళహరి సుధాకర్ దీపారాధన కార్యక్రమాన్ని చేపట్టారు. సోమవారం రాత్రి పట్టణంలోని కచ్చేరిమిట్ట శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో రంగవల్లులు వేసి, వాటిపై దీపాలు వెలిగించారు. తిరుమల లడ్డూలో కల్తీ నెయ్యి వాడకం ముమ్మాటికీ వాస్తవమన్నారు. న్యాయస్థానం అభిప్రాయాలను తప్పుబట్టేలా వైకాపా నాయకులు మాధ్యమాల్లో చేస్తున్న ప్రచారం దారుణమన్నారు.

మొక్కల పెంపకంతో పర్యావరణ పరిరక్షణ

కావలి గ్రామీణం : ప్రతిఒక్కరూ మొక్కలు నాటి పెంచి పర్యావరణాన్ని పరిరక్షించాలని ఆర్థిక అక్షరాస్యత కౌన్సిలర్ రవి పేర్కొన్నారు. స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని పాతవూరులో పురపాలక ఉన్నత పాఠశాలలో సోమవారం మొక్కలు నాటారు. విద్యార్థులకు మొక్కల పెంపకంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సుబ్బారావు, ప్రణీత్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ముగ్గురు గంజాయి విక్రేతల అరెస్ట్

కావలి, న్యూస్‌టుడే: పట్టణ శివారులో గంజాయి విక్రయిస్తున్న ముగ్గురిని సోమవారం పోలీసులు పట్టుకున్నారు. ఒకటో పట్టణ సీఐ ఫిరోజ్‌కు వచ్చిన సమాచారంతో తుమ్మలపెంట రోడ్డు వద్ద దాడులు చేశారు. వాయినందన వీధికి చెందిన కొక్కు సాయి, గుంజి తిరుమల, నెల్లూరు కపాడిపాలెంలో నివసించే గయాజ్‌బాషాను అరెస్ట్ చేశారు. వారి నుంచి 800 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.

భర్త అనుమానం.. నిప్పంటించుకున్న భార్య

కావలి, న్యూస్‌టుడే: భర్త అనుమానిస్తున్నాడని నిప్పంటించుకుని గాయాలపాలైన వివాహిత వైనమిది. సోమవారం కావలి మండలంలోని ఓ గ్రామంలో ఈ ఘటన చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన వివాహిత కూలి పనులకు వెళుతూ వేరొకరితో సన్నిహితంగా ఉంటున్నట్లు భర్త అనుమానించాడు. దీన్ని అవమానంగా భావించి ఒంటికి నిప్పంటించుకుంది. గాయాలైన ఆమెను పట్టణంలోని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదుచేశారు.

జాతీయ రహదారిపై ప్రమాదం.. ఇద్దరి దుర్మరణం

చల్లపల్లి, న్యూస్‌టుడే: కృష్ణా జిల్లా చల్లపల్లి మండలం లక్ష్మీపురం పంచాయతీ నూకలవారిపాలెం వద్ద జాతీయ రహదారిపై సోమవారం తెల్లవారుజామున చోటు చేసుకున్న ప్రమాదంలో ఇద్దరు దుర్మరణం పాలయ్యారు. రోడ్డు దాటుతున్న యాచకుడిని లారీ ఢీకొని బోల్తా కొట్టిన ఘటనలో యాచకుడితోపాటు లారీపైన నిద్రిస్తున్న డ్రైవర్ కూడా మృతి చెందాడు. వివరాల్లోకి వెళ్తే.. కందుకూరుకు చెందిన లారీ ఒడిశా నుంచి ఇనుప రాడ్డుల లోడుతో చెన్నై వెళ్తోంది. డ్రైవర్ షేక్ ఖాదర్ బాషా(41)కు నిద్రరావడంతో క్లీనర్ షేక్ బాబుకు డ్రైవింగ్ అప్పగించి సోమవారం తెల్లవారుజామున లారీపైన పడుకున్నాడు. కృష్ణా జిల్లా చల్లపల్లి-నూకలవారిపాలెం అడ్డరోడ్డు వద్దకు రాగానే జాతీయ రహదారిపై వెళ్తున్న యాచకుడిని ఢీకొని అదుపుతప్పి లారీ పల్టీ కొట్టింది. ఈ ఘటనలో డ్రైవర్ ఖాదర్‌బాషా ఇనుప రాడ్డుల కిందపడి మృతిచెందాడు. లారీ ఢీకొనడంతో యాచకుడు అక్కడికక్కడే మృతిచెందగా, లారీ నడుపుతున్న క్లీనర్ షేక్‌బాబుకు కాళ్లు విరిగిపోయాయి. ఖాదర్‌బాషా సోదరుడి కుమారుడు షేక్ ఫయాజ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు చల్లపల్లి ఎస్.ఐ. పి.ఎస్.వి.సుబ్రహ్మణ్యం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సంక్షిప్త సమాచారం

ఆదర్శప్రాయులు గోవిందరాజులు

బిట్రగుంట : రైల్వే పర్సనల్ డిపార్ట్‌మెంట్ ఓఎస్‌గా పనిచేస్తూ ఉద్యోగ విరమణ పొందిన ఎంప్లాయిస్ సంఘ్ బిట్రగుంట ఛైర్మన్ గోవిందరాజులు ఆదర్శప్రాయులని పలువురు వక్తలు కొనియాడారు. సోమవారం బిట్రగుంట రైల్వే ఇన్‌స్టిట్యూట్‌లో ఘనంగా సత్కారం జరిగింది. విజయవాడ రైల్వే డివిజనల్, నెల్లూరు, ఒంగోలు వంటి వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఉన్నతాధికారులు, కార్మిక సంఘాల నాయకులు ప్రసంగించారు.

3 నుంచి శరన్నవరాత్రి ఉత్సవాలు

కలిగిరి : మండలంలోని తెల్లపాడు భద్రకాళి ఆలయంలో మూడో తేదీ నుంచి 12 వరకు దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్త జూపల్లి వెంకటేశ్వరరావు, కమిటీ సభ్యులు తెలిపారు. ప్రతిరోజూ ఆలయంలో ప్రత్యేక పూజలు జరుగుతాయన్నారు. **దగదర్తి :** దగదర్తిలోని దుర్గాభవాని రామలింగేశ్వర స్వామి ఆలయంలో బుధవారం నుంచి 12వ తేదీ వరకు శరన్నవరాత్రి ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు పేపళ్ల కిషోర్ తెలిపారు. రోజుకో అవతారంలో అమ్మవారు భక్తులకు దర్శనమిస్తారని తెలిపారు.

శిక్షణ తరగతుల ప్రారంభం

ఉదయగిరి, న్యూస్‌టుడే : స్థానిక నాక్ కేంద్రంలో పీఎం విశ్వకర్మ పథకంలో భాగంగా బ్రిక్ మేసన్ బేసిక్ శిక్షణ తరగతులను సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా నాక్ ఎస్పీఓసీ ఎల్.ప్రకాష్ మాట్లాడుతూ ఆరు రోజులపాటు ఉచిత శిక్షణ తరగతులు జరుగుతాయన్నారు. అందులో భాగంగా బ్రిక్ మేసన్ బేసిక్ శిక్షకులకు తాపీ పని, టూల్ కిట్ ఉపయోగంపై అవగాహన కల్పించి హ్యాండ్ పుస్తకాలను అందజేశారు. కార్యక్రమంలో వివిధ విభాగాల సిబ్బంది పాల్గొన్నారు.

ఇన్‌ఛార్జి ఎంపీడీవో బదిలీ

వరికుంటపాడు : వరికుంటపాడు ఇన్‌ఛార్జి ఎంపీడీవో ఎన్.మల్లికార్జున దుత్తలూరు ఈవోపీఆర్డీగా బదిలీ అయ్యారు. ఆయన ఉదయగిరి ఈవోపీఆర్డీగా ఉంటూ వరికుంటపాడుకు ఇన్‌ఛార్జి ఎంపీడీవోగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఆయన సాధారణ బదిలీల్లో దుత్తలూరుకు బదిలీ అయ్యారు. కోవూరు ఈవోపీఆర్డీ ఖాదర్‌వలి వరికుంటపాడుకు ఈవోపీఆర్డీగా నియమించినట్లు కార్యాలయానికి ఉత్తర్వులు వచ్చాయి.

గిరిజనుల అభ్యున్నతికి కృషి చేయాలి

కందుకూరు, గుడ్లూరు : మండలంలో అధికంగా ఉన్న గిరిజనుల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి చేయాలని సీపీఎం నాయకులు జి.వెంకటేశ్వర్లు అన్నారు. గుడ్లూరులో పార్టీ మహాసభను సోమవారం నిర్వహించారు. ప్రధాన వీధిలో ఆక్రమణలు తొలగించాలన్నారు. మండల శాఖ కార్యదర్శిగా స్టాలిన్, వెంకయ్యను ఎంపిక చేశారు. కార్యక్రమంలో మద్దిశెట్టి జాలయ్య, కృష్ణయ్య, ఎం.వెంకటేశ్వర్లు, విజయలక్ష్మి పాల్గొన్నారు.

టిడ్కో లబ్ధిదారులకు మోసం

కందుకూరు పట్టణం: టిడ్కో ఇళ్లను స్వాధీనం చేసుకుంటున్న బ్యాంకర్ల నుంచి లబ్ధిదారులను ఆదుకోవాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి బి.సురేశ్‌బాబు ప్రభుత్వాన్ని కోరారు. రుణమాఫీ అవుతాయనే భ్రమలో టిడ్కో లబ్ధిదారులు మోసపోయారని ఆవేదన వ్యక్తం చేశారు.

రైతులకు పంటల సాగుపై అవగాహన

కందుకూరు పట్టణం : పట్టణంలోని సీటీఆర్ఐ, కేవీకేలో చేపడుతున్న కంది, మినుము, పెసర, సజ్జ పంటల్లో ఉత్తమ యాజమాన్య పద్ధతులపై రైతులకు సోమవారం అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీటీఆర్ఐ ప్రధాన శాస్త్రవేత్త అనూరాధ, సీనియర్ శాస్త్రవేత్త జి.ప్రసాద్, వెంకటేష్, ఆత్మ ఏడీఏ రామ్మోహన్, ఏవోలు శేషమ్మ, యుగంధర్, శైలజ పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శుల బదిలీ

ఉదయగిరి : పలువురు పంచాయతీ కార్యదర్శులను వేర్వేరు ప్రాంతాలకు బదిలీ చేస్తూ స్థానిక మండల పరిషత్తు కార్యాలయానికి జిల్లా పంచాయతీ అధికారులు సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. శకునాలపల్లి కార్యదర్శి గాజులపల్లి అమరనాథ్‌రెడ్డిని బుచ్చిరెడ్డిపాలెం మండలంలోని పంచేడు, గండిపాలెం కార్యదర్శి కరిముల్లాను శకునాలపల్లికి, కొండాయపాలెం పంచాయతీ కార్యదర్శి నాగూర్‌బీని తిరుమలాపురం, అప్పసముద్రం పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్‌ను జి.అయ్యవారిపల్లికి, జి.అయ్యవారిపల్లి కార్యదర్శి ఏ.శ్రీనివాసులును అప్పసముద్రం, తిరుమలాపురం కార్యదర్శి వెంకటరమణను గండిపాలెం పంచాయతీలకు బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈవోపీఆర్డీ మల్లికార్జునను దుత్తలూరుకు బదిలీ చేశారు.

ప్రధానోపాధ్యాయులకు పుస్తకాలు అందజేత

ఉదయగిరి : స్థానిక మండల విద్యావనరుల కేంద్రంలో సోమవారం మండలంలోని 1-10 తరగతులు చదివే విద్యార్థులకు ప్రభుత్వం సరఫరా చేసిన సెమిస్టర్ 2 పాఠ్యపుస్తకాలను ఎంఈవో-2 తోట శ్రీనివాసులు పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు పంపిణీ చేశారు.

అంతర్రాష్ట్ర మహిళా దొంగల అరెస్టు

తిరుపతి (నేరవిభాగం), న్యూస్‌టుడే: తిరుపతి గ్రామీణ పరిధిలో ఒకే రాత్రి మూడిళ్లలో చోరీలకు పాల్పడిన ఇద్దరు అంతర్రాష్ట్ర మహిళా దొంగలను అరెస్టు చేసినట్లు చంద్రగిరి డీఎస్పీ ప్రసాద్ తెలిపారు. సోమవారం ఆయన వివరాలు వెల్లడించారు. సెప్టెంబరు 20న ఓటేరులోని మూడు ఇళ్లలో దొంగలు పడి.. రూ.29 లక్షల విలువైన బంగారు, వెండి, నగదు కాజేశారు. దానిపై సీఐ చిన్న గోవింద కేసు నమోదు చేసి నాలుగు ప్రత్యేక బృందాలతో దర్యాప్తు చేపట్టారు. ఆ క్రమంలో సోమవారం మధ్యాహ్నం రామానుజపల్లి చెక్‌పోస్టు వద్ద హైదరాబాద్‌లోని ఎల్‌బీ నగర్‌కు చెందిన శెట్టి లక్ష్మి (40), శెట్టి మీనా (29)లను అరెస్టు చేశారు. వారి నుంచి రూ. 6.37 లక్షల విలువైన నగలు స్వాధీనం చేసుకున్నారు. నిందితుల భర్తలు విజయ్, మణి నెల్లూరు జిల్లా కందుకూరు, రావులపాలెంలో చోరీలకు పాల్పడి జైలుశిక్ష అనుభవించారు.

రెండు ఇసుక ట్రాక్టర్లు స్వాధీనం

కొండాపురం, న్యూస్‌టుడే: మండలంలోని చింతలదేవి వాగు నుంచి ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను ఎస్సై బి. మహేంద్ర ఆదివారం రాత్రి అదుపులోకి తీసుకున్నారు. గ్రామం సమీపంలోని వాగులో కొంత కాలంగా రాత్రిళ్లు ఇసుక తరలిస్తున్నట్లు సమాచారంతో వెళ్లి అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

అస్తవ్యస్తం.. ఆర్బీకేలు సమస్తం




రైతు సేవా కేంద్రంలో నిరుపయోగంగా కియోస్క్ యంత్రం

న్యూస్‌టుడే, కందుకూరు గ్రామీణం

గత ప్రభుత్వం రైతులకు ప్రత్యేకంగా ఆర్బీకేలను నిర్మించారు. నిర్మించిన నాటి నుంచి ప్రకటించిన సేవలు ఎన్నడూ పూర్తిస్థాయిలో రైతులకు అందలేదు. ఒక్కో భవన నిర్మాణానికి సుమారు రూ.23లక్షల వరకు ఖర్చు చేశారు. ఇది కాకుండా అందులో టీవీ, అంతర్జాలం, కియోస్క్ యంత్రం మరో రూ.2లక్షల వరకు ఖర్చు చేశారు. మండలంలో 13 కేంద్రాలకు రూ.3.25కోట్లు ఖర్చు చేశారు. ప్రస్తుతం ఈ కేంద్రాల్లో ఎరువులు, పురుగుమందులు, విత్తనాలు ఎక్కడా నిల్వ లేవు. ప్రస్తుత ప్రభుత్వం రబీకి ఎరువులను పీఏసీఎస్‌ల ద్వారా పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకుంటోంది. ఇవి మండలంలోని మోపాడు, పలుకూరు, మహదేవపురంలోనే పీఏసీఎస్ కమిటీలున్నాయి. మండలంలో రబీలో 400 హెక్టార్లలో వరి, 2500 హెక్టార్లలో శనగ, 2500 హెక్టార్లలో పొగాకు, 400 హెక్టార్లలో పత్తి, మరో 150 ఎకరాల్లో ఇతర పంటలు సాగు చేస్తారు. ఈ రైతులు ఇక పట్టణాల్లోని ఎరువుల దుకాణాల నుంచే కొనుగోలు చేసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది.

వలేటివారిపాలెం : ప్రస్తుతం పంటల సాగుకు అవసరమైన రసాయనిక ఎరువుల కొరత కారణంగా అన్నదాతలు అవస్థలు పడుతున్నారు. మండలంలో మినుము, మిర్చి పంటలను విస్తారంగా సాగు చేస్తున్నారు. రైతు సేవా కేంద్రాల్లో మినుము విత్తనాలు అందుబాటులో ఉండగా రసాయనిక ఎరువులైన డీఏపీ, యూరియా ప్రాథమిక వ్యవసాయ సహకార సొసైటీలలో ఎరువుల నిల్వలు లేక ప్రయివేటు వ్యాపారులు డిమాండ్‌కు అనుగుణంగా ధరలను అమాంతం పెంచారు. ఈ విషయమై ఏవో హేమంత్ భరత్‌కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వానికి 100 క్వింటాళ్ల మినుము విత్తనాలు అవసరమని ప్రతిపాదనలు పంపించామన్నారు.

ఆర్బీకేల్లో ఎరువులు విక్రయాలు ఉత్తిదే



ఆర్బీకే(వ్యవసాయశాఖ కార్యాలయం)

గుడ్లూరు : గత ప్రభుత్వం ఆర్బీకేల్లో ఎరువుల విక్రయమంటూ చేసిన హడావుడి ముగిసింది. మండలంలోని 16 ఆర్బీకేల్లో ఎరువుల విక్రయాలు లేవు. కేవలం పచ్చిరొట్ట విత్తనాలు, శనగ, మినుము విత్తనాల పంపిణీకి మాత్రమే వీటిని ఉపయోగిస్తున్నారు. ఆర్బీకేల్లో ఇక నుంచి ఎరువుల విక్రయాలు ఉండవని ఏవో రవికుమార్ తెలిపారు.

పశ్చిమంలో గంజాయి గుప్పు గుప్పు



న్యూస్‌టుడే, ఉదయగిరి

ఉదయగిరి ప్రాంతంలో గంజాయి వాసన గుప్పుమంటోంది. సులభంగా నగదు సంపాదనకు అలవాటు పడిన ఈ ప్రాంతానికి చెందిన కొందరు యువతకు దీని వాసన చూపించి మత్తులో తూగేలా చేస్తున్నారు. దీనికి బానిసలయ్యే యువత సంఖ్య పెరుగుతుండడంతో తమ బిడ్డల భవిష్యత్తు నాశనమవుతుందని తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ఇటీవల జమ్మలమడుగు ప్రాంతంలో గంజాయి తరలిస్తున్న వారిని అక్కడి పోలీసులు పట్టుకోగా అందులో ఉదయగిరికి చెందిన ఒక యువకుడు ఉన్నట్లు గుర్తించారు. జమ్మలమడుగు పోలీసులు వచ్చి అతన్ని అదుపులోకి తీసుకున్నారు.

పాఠశాల భవనాలు, జనసంచారం లేని మార్గాల్లో...



గంజాయి పొట్లాలు (పాతచిత్రం)

ఉదయగిరి ప్రాంతంలో గంజాయి మత్తుకు అలవాటు పడిన వారు జన సంచారం లేని పాఠశాల భవనాలు, అటవీ ప్రాంతానికి దగ్గర ఉండే చెట్ల పొదలు, జాతీయ రహదారి పరిసర ప్రాంతాలను ఎంపిక చేసుకుంటున్నారు. పొడిగా చేసి సిగరెట్లలో ఎక్కించి తాగుతున్నారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానం వద్ద పాఠశాల భవనాల్లో కొన్ని నిరుపయోగంగా ఉన్నాయి. మరికొన్ని నూతనంగా నిర్మిస్తున్నారు. గ్రామానికి చివరిగా ఉండడం, వెనుక వైపు అటవీ ప్రాంతం కావడంతో జన సంచారం ఉండదు. దీంతో పాఠశాల భవనాల్లో సాయంత్రం, రాత్రి వేళల్లో స్థావరంగా కొనసాగిస్తున్నట్లు స్థానికుల ద్వారా సమాచారం. సంబంధిత అధికారులు విక్రయాలను అడ్డుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

పేపర్లలో పొట్లాలు కట్టి..

ఉదయగిరి ప్రాంతంలో కొంత కాలంగా గుట్టుగా విక్రయిస్తున్నారు. కడప, ప్రకాశం జిల్లాలతో పాటు కావలి ప్రాంతాలకు బైకులపై వెళ్లి అక్కడి నుంచి తీసుకొస్తున్నట్లు సమాచారం. సీతారామపురంలోని కొన్ని ప్రాంతాలతోపాటు ఉదయగిరిలోని దుర్గంపల్లి, జాతీయ రహదారి మార్గాలతో పాటు జనసంచారం లేని రహస్య ప్రాంతాల్లో పేపర్లలో చిన్న పొట్లాలు కట్టి జేబుల్లో పెట్టుకొని గుట్టుగా ఒక్కో దాన్ని రూ. 100 వంతున విక్రయిస్తున్నట్లు సమాచారం.

నిఘా ఉంచాం : వెంకటరావు, సీఐ, ఉదయగిరి

ఉదయగిరి ప్రాంతంలో గంజాయి విషయమై మాకు వస్తున్న సమాచారం మేరకు నిఘా కొనసాగిస్తున్నాం. ఇటీవల కొందరు చెప్పిన సమాచారం మేరకు ఆయా ప్రాంతాల్లో తనిఖీలు చేశాం. గతంలో గంజాయి విక్రయిస్తూ పట్టుబడిన వారి కదలికలు పసిగడుతున్నాం. వారి వివరాలు సేకరిస్తున్నారు. పూర్తిస్థాయిలో జరగకుండా పటిష్టమైన చర్యలు తీసుకుంటాం.

కోవూరు

• కోవూరు • సర్వేపల్లి • ఆత్మకూరు

కుష్ఠు నివారణకు చర్యలు

తోటపల్లిగూడూరు, మనుబోలు, న్యూస్‌టుడే: కుష్ఠు మందులతో నయమవుతుందని క్షయ, కుష్ఠు నిర్మూలన అధికారి, అదనపు డీఎంహెచ్‌వో ఖాదర్‌వలీ అన్నారు. సోమవారం తోటపల్లిగూడూరు మండలంలోని వరిగొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. క్షయ, కుష్ఠు బాధితుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం రావూరివారికండ్రిగలో పలు ఆరోగ్య కార్యక్రమాలను పరిశీలించారు. వైద్యురాలు రాధిక తదితరులు ఉన్నారు.

ఆర్థిక సాయం అందజేత

ఆత్మకూరు, న్యూస్‌టుడే: పట్టణంలోని బ్రాహ్మణవీధికి చెందిన సుభద్రాదేవి ఇటీవల మృతి చెందారు. తల్లిదండ్రులను కోల్పోయి అనాథలుగా మిగిలిన ఆమె పిల్లలు శీలా గౌరీదేవి, కాశీవిశ్వనాథ్‌లకు విజంజం దొరసానమ్మ ఛారిటబుల్‌ట్రస్ట్ ఆధ్వర్యంలో రూ.10 వేలు డాక్టర్ ప్రణీత్ అందజేశారు. డాక్టర్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మెప్మా అర్బన్ మార్కెట్ సద్వినియోగంతో ఊరట

బుచ్చిరెడ్డిపాళెం, న్యూస్‌టుడే: మెప్మా పొదుపు సంఘాల అర్బన్ మార్కెట్‌ను సద్వినియోగం చేసుకోవాలని చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ తెలిపారు. బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీలో నూతనంగా ఏర్పాటు చేసిన మార్కెట్‌ను సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మహిళలు తయారుచేసిన వస్తువులు సందర్శించి ప్రత్యేకంగా అభినందించారు. రాష్ట్ర డైరెక్టర్ తాళ్లస్వామి, కౌన్సిలర్ ప్రమీలమ్మ, మెప్మా సీవో నర్మద, ఆర్పీలు పాల్గొన్నారు.


మహిళా మార్టును ప్రారంభిస్తున్న చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ

బాధ్యతల స్వీకరణ

పొదలకూరు, ఆత్మకూరు, మనుబోలు, సైదాపురం, సంగం, బుచ్చిరెడ్డిపాళెం, న్యూస్‌టుడే: పలు మండలాల్లో వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన ఉద్యోగులు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. పొదలకూరు తహసీల్దారుగా శివకృష్ణయ్య, రీ-సర్వేగా డీటీ సురేఖ, ఆర్‌అండ్‌బీ ఏఈగా శ్రీనివాసులు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈగా రమేష్, ఆత్మకూరు ఎక్సైజ్ సీఐగా వెంకటరమణమ్మ, మనుబోలు మండలంలో రీ సర్వే డీటీగా మంజుల, గృహనిర్మాణశాఖ ఏఈగా భాస్కర్‌రావు, సైదాపురం తహసీల్దారుగా రమాదేవి, సంగం ఎస్సైగా వి.రాజేష్, బుచ్చిరెడ్డిపాళెం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐగా కేపీ కిశోర్ బాధ్యతలు స్వీకరించారు. బాధ్యతగా విధులు నిర్వహిస్తామన్నారు.

లడ్డూ కల్తీ చేసినవారిపై చర్యలు తీసుకోవాలి

తోటపల్లిగూడూరు, మనుబోలు, న్యూస్‌టుడే : తిరుమల లడ్డూ తయారీలో కల్తీ నెయ్యి వినియోగానికి కారకులైన వారిపై చర్యలు తీసుకోవాలని జనసేన మండలాధ్యక్షుడు పెనుబాక ప్రసాద్ డిమాండ్ చేశారు. ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ చేపట్టిన ప్రాయశ్చిత్త దీక్షకు మద్దతుగా మనుబోలులోని శివాలయం వద్ద సోమవారం రాత్రి దీపాలు వెలిగించారు. సనాతన ధర్మ పరిరక్షణకు ప్రతిఒక్కరూ నడుంబిగించాలన్నారు. తోటపల్లిగూడూరు మండలం కాటేపల్లి శివాలయం వద్ద దీపారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. నాయకులు జాకీర్, సురేష్, భవాని, శ్రీహరి, జయసుధ, శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

అసంపూర్తి నిర్మాణం..
పొంచి ఉన్న ప్రమాదం

సంగం, న్యూస్‌టుడే: సంగం జడ్పీ ఉన్నత పాఠశాల పెన్నానది గట్టునే ఉంది. ఇక్కడ వాతావరణం ఆహ్లాదకరంగా ఉన్నా.. వర్షాలు, వరదలు వచ్చినపుడు విద్యార్థులు బిక్కుబిక్కుమంటూ కాలం గడపాల్సివస్తోంది. ఏ క్షణంలో వరద ప్రవాహం ప్రమాదానికి గురి చేస్తుందోనంటూ వారి తల్లిదండ్రులు ఆందోళనకు గురవుతున్నారు. పోర్లుకట్ట నిర్మాణం చేస్తే సురక్షితంగా ఉండే అవకాశం ఉన్నా.. ఆ దిశగా అధికారులు చర్యలు తీసుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అత్యంత సమీపంలో..

పెన్నానదిలో బీరాపేరు, బొగ్గేరు వాగులు కలిసే అత్యంత సమీప ప్రాంతంలో 1960వ దశకంలో ఉన్నత పాఠశాలను ఏర్పాటు చేశారు. నాలుగు గదులతో ఉన్న భవనం కొంచెం మెరకలో ఉండగా, మిగిలిన ప్రాంతమంతా పూర్తిగా పల్లంలో ఉండేది. 1990లలో అప్పటి జలవనరుల శాఖ అధికారుల చొరవతో మెరక చేశారు. అందుకు అనుగుణంగా రక్షణ గోడను వివిధ దశల్లో ఎత్తు పెంచారు. దానికి సరైన ఆధారం లేకపోవడంతో భారీ వర్షాలు, పెన్నానదికి వరదలు వచ్చినప్పుడల్లా.. ఈ ప్రాంతంలో దాని ఉద్ధృతి ఎక్కువగా ఉంటుంది. ఆ సమయంలో గోడ కూలడం, ప్రవాహం పాఠశాలలోకి ప్రవేశించడం జరుగుతూ ఉంది. అదృష్టవశాత్తు సెలవు దినాల్లో, రాత్రి పూట సంభవిస్తుండటంతో ఇప్పటి వరకు ఎలాంటి ప్రమాదాలు జరగలేదు. ప్రస్తుతం 400 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఏ మాత్రం అజాగ్రత్తగా ఉన్నా.. ప్రమాదం తప్పదని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పోర్లుకట్ట నిర్మాణం పూర్తిచేయాలని కోరుతున్నారు.


పెన్నానది గట్టునే సంగం జడ్పీ ఉన్నత పాఠశాల

కట్ట నిర్మిస్తే..

ఈ ప్రమాదకర పరిస్థితిని దూరం చేయాలంటే పాఠశాల వెనుక వైపు పోర్లుకట్టను సమగ్రవంతంగా నిర్మించాలని గతంలో జలవనరుల శాఖ అధికారులు నిర్ణయించారు. సంగం బ్యారేజీ నిర్మాణంలో భాగంగా నూతనంగా పోర్లుకట్టను ఏర్పాటు చేసేందుకు తెలుగుగంగ అధికారులు సైతం ప్రతిపాదించారు. ఆ మేరకు దువ్వూరు కాలువ ప్రారంభం నుంచి సంగమేశ్వరాలయం వరకు పాఠశాల వెనక వైపు నిర్మించాల్సి ఉంది. కొద్దినెలల క్రితం కాలువలో నూతనంగా నిర్మించిన రెగ్యులేటరు నుంచి పాఠశాల సమీపం వరకు మాత్రమే పోర్లుకట్టను నిర్మించారు. రూ.50 కోట్లకు పైగా బకాయిలున్నాయంటూ గుత్తేదారులు అర్ధాంతరంగా పనులు నిలిపేశారు. ఇప్పటికైనా పూర్తి చేయాలని విద్యార్థులు కోరుతున్నారు. తెలుగు గంగ ఈఈ మేకల అనీల్‌కుమార్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లగా గుత్తేదారులతో చర్చించి తగిననిర్ణయం తీసుకుంటామన్నారు.


పాఠశాల వెనక వైపున నిలిచిన పోర్లుకట్ట నిర్మాణం

మేమున్నాం.. మీకు తోడుగా!

(10 AM to 1 PM) కోవూరు : 80085 73987, సర్వేపల్లి : 80085 73980, ఆత్మకూరు: 8008573949

సమస్య: పొదలకూరు పట్టణంలో నర్సరారెడ్డి కాలనీ, ఎమ్మార్వో కాలనీ, రామనగర్ ప్రాంతాల్లో వీధి కుక్కలు స్థానికులను బెంబేలెత్తిస్తున్నాయి. **- రమణమ్మ, స్థానికురాలు**

సమాధానం: పశుసంవర్ధకశాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లి వీధి కుక్కలకు సంతాన నిరోధక శస్త్రచికిత్సలు చేయించేలా చర్యలు తీసుకుంటాం. **- దొరబాబు, పంచాయతీ కార్యదర్శి**

? కోవూరులోని బజారు కూడలిలో శీలంశెట్టి వారి వీధిలో చేతిబోరు చెడిపోవడంతో నీటి కోసం తీవ్ర ఇక్కట్లుపడుతున్నాం. **- స్థానికులు, శీలంశెట్టివారి వీధి**

✓ ఇప్పటికే ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు తెలిపాం. త్వరలోనే మరమ్మతులు జరిగేలా చర్యలు తీసుకుంటాం. **- శివకుమార్, ఈవో**

? మండలంలోని డేవిస్‌పేట ప్రధాన మార్గంలో మురుగునీటి కాలువల్లో చెత్త పేరుకుపోయింది. **-శ్రీనివాసులు, స్థానికుడు**


✓ మురుగునీటి కాలువల్లో చెత్తను తొలగించేందుకు చర్యలు తీసుకుంటాం. **- లెనిన్, పంచాయతీ కార్యదర్శి**

తుప్ప పడుతున్నా.. పట్టించుకోరా..?



స్వచ్ఛ భారత్‌లో భాగంగా పొదలకూరు మేజరు పంచాయతీకి గతంలో స్వచ్ఛశుభ్రత రిక్షాలు అందజేశారు. పట్టణంలోని ఇళ్ల నుంచి వేర్వేరుగా తడి, పొడిచెత్తను సేకరించేందుకు వీలుగా ఉండేవి. కొంత కాలం వినియోగించినా.. ఆపై వదిలేయడంతో తుప్పపట్టి పనికిరాకుండా పోతున్నాయి. రూ.లక్షలు వెచ్చించి కొనుగోలు చేసిన రిక్షాలు మూలనపడేయంతో ప్రజాధనం వృథా అవుతుందని స్థానికుల నుంచి విమర్శలు వస్తున్నాయి. చెత్తసేకరించేందుకు ట్రక్కు, ఆటోలు మంజూరవడంతో వాటినే వినియోగిస్తున్నామని మేజరు పంచాయతీ కార్యదర్శి దొరబాబు తెలిపారు. **- పొదలకూరు, న్యూస్‌టుడే**

మలుపు.. ప్రమాదానికి పిలుపు



సంగం-కలిగిరి రహదారిలో సంగం దాటిన తరువాత మలుపు అత్యంత ప్రమాదకరంగా ఉంది. స్థానికంగా హోల్డాన్‌గా పేరొందిన ఆ మలుపు చాలాఎక్కువ దూరం ఉంటుంది. దీనికి తోడు ఇరువైపులా విస్తారంగా చెట్లు ఉండడంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనపడడం లేదు. ఫలితంగా తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఆదివారం రాత్రి ఓ ద్విచక్రవాహనదారుడ్ని ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో మృతిచెందారు. రహదారులు భవనాల శాఖ అధికారులతో మాట్లాడి చెట్లు తొలగించి, సూచిక బోర్డులను ఏర్పాటు చేసేలా చర్యలు చేపడతామని సీఐ కె.వేమారెడ్డి తెలిపారు. **- న్యూస్‌టుడే, సంగం**

ఉద్యోగానికి వీడ్కోలు.. విద్యార్థులకు బహుమతులు



ఉద్యోగ విరమణ సందర్భంగా సదరు ఉద్యోగులకు బహుమతులు ఇస్తుంటారు. ఇందుకు విభిన్నంగా సంగంలోని జడ్పీ ఉన్నతపాఠశాలలో గ్రంథాలయాధికారిగా విధులు నిర్వహించిన ఆళ్ల వెంకటసుబ్బయ్య సోమవారం ఉద్యోగవిరమణ సందర్భంగా రూ.లక్ష విలువైన నాణ్యమైన మంచి నీళ్ల సీసాలను 400 మంది విద్యార్థులకు బహుమతిగా అందజేశారు. విద్యార్థులు హర్షధ్వానాలతో ఆయనకు ఘన వీడ్కోలు పలికారు. **- న్యూస్‌టుడే, సంగం**

తీరంలో చెత్త తొలగింపు



విడవలూరు, న్యూస్‌టుడే: విడవలూరు మండలంలోని రామతీర్థం బీచ్, గౌరీపురం, ఆంజనేయపురం సముద్రం తీర ప్రాంతాల్లో రిలయన్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్వచ్ఛతాహీ సేవ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఇందులో భాగంగా సముద్రం ఒడ్డున చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించారు. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధులు స్వచ్ఛతపై స్థానికులకు అవగాహన కల్పించి మానవహారం నిర్వహించారు. కార్యక్రమంలో రిలయన్స్ ఫౌండేషన్ రీజనల్ కోఆర్డినేటర్ యాకోబు, ప్రతినిధి సుందర్‌రాజు, విలేజ్ ఫిషరీస్ అసిస్టెంట్స్ నాగరాజు, సుహాస్, మెరైన్ సిబ్బంది, మత్స్యకారులు పాల్గొన్నారు.

పోటీల్లో విద్యార్థుల సత్తా

చేజర్ల, న్యూస్‌టుడే: స్వర్ణాంధ్ర 2047 సాధనకు విద్యా వ్యవస్థలో చేపట్టాల్సి మార్పులపై జిల్లా స్థాయిలో సోమవారం నెల్లూరులో నిర్వహించిన పోటీల్లో చేజర్ల విద్యార్థులు సత్తా చాటారు. లుంబినీ విద్యాలయానికి చెందిన యు.అనూష, మానస స్కూల్‌కు చెందిన రేణమ్మ.. డిబేట్‌లో ప్రథమ స్థానం సాధించారు. ఉపన్యాసంలో చేజర్ల జడ్పీ ఉన్నతపాఠశాలకు చెందిన పుష్ప తృతీయస్థానంలో నిలిచింది. వీరికి నెల్లూరు డిప్యూటీ డీఈవో ప్రసన్నలక్ష్మి ప్రశంసా పత్రాలు అందజేశారు. ఎంఈవో డీసీ మస్తానయ్య, ఉపాధ్యాయులు అభినందించారు.


ప్రశంసా పత్రాలు అందుకుంటున్న చేజర్ల విద్యార్థులు

సంగం : అంతరిక్ష వారోత్సవాల సందర్భంగా సంగంలో సోమవారంజరిగిన మండల స్థాయి క్విజ్ పోటీల్లో మర్రిపాడు,అన్నారెడ్డిపాళెం ఉన్నత పాఠశాలలకు చెందిన ఎస్.జగదీష్‌పి.శ్రీలేఖ ప్రథమ, ద్వితీయస్థానాల్లో నిలిచారు. జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు.

రోడ్డు ప్రమాదాల నియంత్రణకు చర్యలు

మనుబోలు, న్యూస్‌టుడే: రోడ్డు ప్రమాదాల నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేడుతున్నామని నెల్లూరు గ్రామీణ డీఎస్పీ శ్రీనివాసరావు పేర్కొన్నారు. సోమవారం స్థానిక పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. కంటైనర్‌లోని సామగ్రి చోరీపై ఎస్సైతో సమీక్షించి పలు సూచనలు, సలహాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మద్యం తాగి వాహనాలు నడపడం, నిద్రమత్తు కారణంగా రోడ్డు ప్రమాదాలు సంభవిస్తున్నాయని అన్నారు. దూరప్రాంతాల నుంచి వచ్చే వాహనదారులకు విశ్రాంతి ప్రాంతాలు ఏర్పాటుచేసి వసతి కల్పించడంతో పాటు భద్రత కల్పించాల్సిన బాధ్యత టోల్‌ప్లాజా అధికారులుదేనన్నారు. గ్రామాల్లో దొంగతనాలను అరికట్టేందుకు, జాతీయ రహదారిపై నేరాలు జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. ఆయన వెంట ఎస్సై రాకేశ్, సిబ్బంది శ్రీనివాసులు, మాధవ్‌రావు తదితరులు ఉన్నారు.

భక్తి సుగంధం


గంధాన్ని కలుపుతున్న సజ్జాద ఎస్‌జీఎస్ ఫయాజ్‌అహ్మద్, ఈవో తదితరులు

అనుమసముద్రంపేట, న్యూస్‌టుడే: ఏఎస్‌పేటలో ఆదివారం అర్ధరాత్రి తరువాత హజరత్‌ఖాజానాయబ్‌రసూల్ దర్గాలో 251వ గంధ మహోత్సవం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. దర్గా నిర్వాహక కార్యాలయం నుంచి వక్ఫ్ బోర్డు ఎగ్జిక్యూటివ్ అధికారి మహ్మద్ హుస్సేన్ ఆధ్వర్యంలో గంధకలశాలను మొక్కుబడిదారులు, గ్రామపెద్దలు దర్గాకు తీసుకువచ్చారు. షాగులాం కుటుంబానికి చెందిన ఎస్‌జీఎస్ ఫయాజ్‌అహ్మద్ సైతం గంధ కలశాన్ని తలపై ఉంచుకుని ఊరేగింపుగా దర్గాకు బయల్దేరారు. సమాధులకు గంధలేపనం చేసి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

వెంకటాచలం : కసుమూరు మస్తాన్‌వలీ గంధమహోత్సవం వైభవోపేతంగా జరిగింది. ఆదివారం అర్ధరాత్రి చందన్ మహల్ నుంచి గుర్రంపై బయల్దేరిన గంధం సోమవారం ఉదయం దర్గాకు చేరింది. కడప పీఠాధిపతి ఆరీఫుల్లా హుస్సేన్ దర్గాపై సుగంధ ద్రవ్యాలు చల్లి సిజరా(వంశస్థుల పేర్లు) చదివారు. సమాధికి గంధ లేపనం చేశారు. అనంతరం భక్తులకు గంధం పంపిణీ చేశారు.


దర్గా వద్ద భక్తుల సందడి

యథేచ్ఛగా మట్టి తరలింపు.. అడ్డుకున్న గ్రామస్థులు

అనంతసాగరం, న్యూస్‌టుడే : మండల పరిధిలోని పడమటి కంభంపాడు నల్ల చెరువులో ఆదివారం అర్ధరాత్రి అనుమతులు లేకుండా మట్టిని అక్రమంగా ట్రాక్టర్ల ద్వారా తరలిస్తుండగా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఇటుక బట్టీల కోసం కొందరు స్థానికులు పెద్ద ఎత్తున చెరువులో మట్టి తవ్వకాలు కొనసాగించారు. దీనిపై గ్రామస్థులు పోలీసులకు సమాచారం అందించడంతో మట్టిని తరలిస్తున్న 11 ట్రాక్టర్లును అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై అనూష తెలిపారు. అనంతరం ఆత్మకూరు మోటర్ వెహికల్ తనిఖీ అధికారి రాములుకు సమాచారం అందించడంతో సోమవారం ట్రాక్టర్ల యజమానుల వద్ద నుంచి వాహనాల పత్రాలను తీసుకున్నారు. **చేజర్ల :** కోటితీర్థంలో వైకాపా నాయకులు ఇనాం భూమితో పాటు సమీపంలోని ప్రభుత్వ భూమిని కలిపి సాగుచేస్తుండటంపై తెదేపా నాయకులు రెవెన్యూ అధికారులకు సోమవారం సమాచారమిచ్చారు. ప్రభుత్వ భూమిలో సాగు చేస్తున్న వారిని వీఆర్వో మహేష్ అడ్డుకుని పంపేశారు. తాము సాగు చేస్తున్న భూమి ప్రభుత్వానికి చెందింది కాదని, గ్రామంలోని పేదలకిచ్చిన పట్టా భూమేనని.. వైకాపా నాయకుడు గోతం వెంకటసుబ్బయ్య తెలిపారు. హక్కు పత్రాలు చూపించిన అనంతరమే పొలం సాగు చేయాలని వీఆర్వో వారికి సూచించారు. లేకుంటే చర్యలు తప్పవన్నారు. **ముత్తుకూరు :** మండలంలోని నేలటూరు సమీప పొలాల్లో నుంచి ఆదివారం రాత్రి ప్రైవేటు లేఅవుట్‌కు అక్రమంగా మట్టి తరలిస్తుండగా గ్రామస్థులు అడ్డుకున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా రెండు నెలల నుంచి రాత్రి వేళల్లో మట్టి తరలిస్తున్నారని గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.


పోలీసుస్టేషన్ వద్ద ట్రాక్టర్లు

ఆలయాల్లో చోరీలకు పాల్పడుతున్న ముఠా అరెస్టు

ఆత్మకూరు, న్యూస్‌టుడే: జిల్లావ్యాప్తంగా పలు ఆలయాల్లో చోరీలకు పాల్పడిన ముఠాను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఆత్మకూరు డీఎస్పీ వేణుగోపాల్ సోమవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఆయన వివరాల మేరకు అనంతసాగరం మండలం పాతదేవరాయపల్లికి చెందిన మానికల చెంచయ్య, చేజర్ల మండలం మాముడూరుకు చెందిన పోటూరు రమణయ్య, నాగులవెల్లటూరుకు చెందిన యాటగిరి కస్తూరి, ఆత్మకూరు మండలం కరటంపాడుకు చెందిన పొట్లూరి పెంచలయ్య అనే నలుగురు ముఠాగా ఏర్పడి దొంగతనాలు చేస్తున్నారన్నారు. ఇటీవల దుత్తలూరు, వరికుంటపాడు, కలిగిరి, సైదాపురం, చేజర్ల, అనంతసాగరం మండలాల్లోని పలు ఆలయాల్లో చోరీలు చేశారన్నారు. పలు చోట్ల నిందితుల చిత్రాలు సీసీ కెమెరాలో నమోదుకాగా వాటి ఆధారంగా దర్యాప్తు కొనసాగించామన్నారు. ఈ క్రమంలో నిందితులను అనంతసాగరం మండలం లింగంగుంట వద్ద సీఐ గంగాధరరావు ఎస్సై సూర్యప్రకాష్‌రెడ్డిలు పట్టుకున్నారన్నారు. రూ.60,700 నగదు, బంగారం, వెండి వస్తువులు స్వాధీనం చేసుకున్నామన్నారు.


నిందితులతో డీఎస్పీ వేణుగోపాల్ తదితరులు

ఆపో్క షోరూంలో చీరల అపహరణ

బుచ్చిరెడ్డిపాళెం : బుచ్చిరెడ్డిపాళెం ఆపో్క షోరూంలో దొంగలుపడి.. రూ.50వేలు విలువచేసే చీరలు మహిళలు దృష్టి మరల్చి దోచుకుపోయినట్లు మేనేజర్ లత పోలీసులకు ఫిర్యాదుచేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పి.శ్రీనివాసులురెడ్డి తెలిపారు.

బుచ్చి శాంతినగర్‌లో ఘర్షణ.. దంపతులకు గాయాలు

బుచ్చిరెడ్డిపాళెం, న్యూస్‌టుడే: బుచ్చిరెడ్డిపాళెం శాంతినగర్‌లో పోలేరమ్మ గుడి విషయంలో ఇరువర్గాలపై కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు.. బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీలోని శాంతినగర్‌లో సోమవారం రాత్రి పోలేరమ్మ గుడి విషయంలో గొడవజరిగి దాడులు జరిగాయి. ఈ గొడవలో ఒక వర్గానికి చెందిన కొండయ్య, వెంకటలక్ష్మి, వరలక్ష్మి, వెంకటేశ్వర్లుకు తీవ్రగాయాలయ్యాయి. మరో వర్గానికి చెందిన నారాయణకు స్వల్ప గాయాలయ్యాయని వివరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

వల తగులుకుని మహిళకు..

మర్రిపాడు, న్యూస్‌టుడే: పందులు పట్టేందుకు రోడ్డుపై వేసిన వల తగులుకుని ఓ మహిళ తీవ్రగాయాలపాలైన సంఘటనరామనాయుడుపల్లి ఎస్సీ కాలనీ సమీపంలో ఉదయగిరి-నెల్లూరు రహదారిపై సోమవారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికుల వివరాల మేరకు ద్విచక్రవాహనంపై కుమారుడితో కలిసి ఆత్మకూరు నుంచి సీతారామపురం వెళుతుండగా రోడ్డుపై పందులు పట్టేందుకు పెంపకందారులు వేసిన వల తగులుకుని కింద పడ్డారు. గాయాలైన మహిళను 108 వాహనంలో ఆత్మకూరు జిల్లా ఆసుపత్రికి తరలించారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని విచారిస్తున్నట్లు తెలిపారు.

క్రీడా ప్రతిభావంతుల ఎంపిక

ఇందుకూరుపేట, న్యూస్‌టుడే: నరసాపురంలో ఎంవీఆర్‌ఆర్ ప్లస్ టు ఉన్నత పాఠశాల విద్యార్థినులు రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైనట్లు వ్యాయామ ఉపాధ్యాయుడు ముజీర్ తెలిపారు. అండర్-17 విభాగంలో ఇందు, అమూల్య.. అండర్-14 బాలికల విభాగంలో జ్యోతి శ్రీకాకుళంలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. **కోవూరు :** ఏపీ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో పట్టణంలోని జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో బాక్సింగ్ క్రీడాకారుల ఎంపికలు జరిగాయి. ఈ సందర్భంగా 13 మంది బాలికలు, 13 మంది బాలురను జిల్లా స్థాయి బాక్సింగ్ క్రీడాకారులను ఎంపిక చేసినట్లు హెచ్ఎం ఝాన్సీరాణి తెలిపారు. **బుచ్చిరెడ్డిపాళెం :** జిల్లా ఫెన్సింగ్ జట్టుకు నలుగురు విద్యార్థులు ఎంపికవ్వడం శుభపరిణామమని కరస్పాండెంటు చిట్టిబాబు తెలిపారు. రెయిన్‌బో పాఠశాలకు చెందిన జిల్లా జట్టుకు ఎంపికైన విద్యార్థుల పాఠశాలకు చెందిన విద్యార్థులు టి.దక్షిణజాయ్, అక్షజ్ రెడ్డి, లవకుమార్, పి.ధనుష్ జిల్లా జట్టుకు ఎంపికయ్యారన్నారు. నంద్యాలలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. **మనుబోలు :** స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలకు ఎంపికయ్యారని పీడీ వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. అండర్-19 స్కూల్ ఫెడరేషన్ గేమ్స్‌లో భాగంగా జరిగిన క్రికెట్ పోటీల్లో ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతున్న అనూష, హబీబా, సుధీర్, హర్షవర్ధన్ ఎంపికయ్యారు. ప్రిన్సిపల్ వేణుగోపాల్‌తో పాటు అధ్యాపక బృందం వారిని అభినందించారు.


అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైన నరసాపురం విద్యార్థినులు


మనుబోలులో క్రీడాకారులను అభినందిస్తున్న అధ్యాపకులు

సోమశిలకు 6,900 క్యూసెక్కుల వరద

అనంతసాగరం, న్యూస్‌టుడే : సోమశిల జలాశయానికి ఎగువ ప్రాంతాల నుంచి సోమవారం సాయంత్రానికి 6,900 క్యూసెక్కుల వరద నీరు వస్తున్నట్లు ప్రాజెక్టు అధికారులు తెలిపారు. ప్రస్తుతం జలాశయంలో 318.415 అడుగుల మేర నీటిమట్టం నమోదైంది. 77.988కి 53.961 టీఎంసీలు నిల్వ ఉంది. -17, -18 రివర్ స్లూయిస్ ద్వారా 5, పవర్ టన్నల్ ద్వారా 1,000 క్యూసెక్కులు డెల్టాకు విడుదల చేస్తున్నారు. నాన్‌డెల్టాలైన ఉత్తర కాలువకు 540, దక్షిణ కాలువ ద్వారా కండలేరు వరద కాలువకు 10,000 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. రోజుకు సగటున 290 క్యూసెక్కులు ఆవిరవుతున్నట్లు ప్రాజెక్టు అధికారులు వివరించారు.

ఆయుర్వేద వైద్యంతో దీర్ఘకాలిక వ్యాధులు నయం

మనుబోలు : ఆయుర్వేద వైద్యంతో దీర్ఘకాలిక వ్యాధులు నయం చేసుకోవచ్చని ఆయుర్వేద వైద్యురాలు జగదీశ్వరి అన్నారు. మండలంలోని పర్లపాడులో సోమవారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మడమనూరులోని ఆయుర్వేద వైద్యశాల ద్వారా మెరుగైన సేవలు అందిస్తున్నామని తెలిపారు. తెదేపా నాయకుడు కూరపాటి సురేష్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

వెంకటగిరి నియోజకవర్గ సమాచారం

ఆక్రమణలపై కలెక్టర్‌కు ఎమ్మెల్యే ఫిర్యాదు

నెల్లూరు(కలెక్టరేట్), న్యూస్‌టుడే: నియోజకవర్గంలో భూ కబ్జాలు ఎక్కువయ్యాయని వాటిపై చర్యలు తీసుకోవాలని వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ సోమవారం కలెక్టర్ ఒ.ఆనంద్‌కు వినతిపత్రం అందించారు. అధికారులు రెవెన్యూ సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టాలని తెలిపారు.

తెదేపా శ్రేణుల పూజలు

రాపూరు : మామిడి కోనలో మల్లయ్యస్వామి ఆలయానికి తెదేపా శ్రేణులు సోమవారం తరలి వెళ్లి మొక్కులు తీర్చుకున్నారు. సీఎంగా చంద్రబాబునాయుడు, వెంకటగిరి ఎమ్మెల్యేగా కురుగొండ్ల రామకృష్ణ గెలిచినందుకు మొక్కులు తీర్చుకున్నట్లు పంగిలి తెదేపా నాయకుడు మదిరా ఎల్లయ్య తెలిపారు.


మామిడికోనలో తెదేపా నాయకులు

3 నుంచి కోనలో దసరా వేడుకలు

రాపూరు, న్యూస్‌టుడే: మండలంలోని పెంచలకోనలో అక్టోబరు 3నుంచి 11 వరకు దసరా వేడుకలు నిర్వహించనున్నట్లు ఆలయ ఉపకమిషనర్ పి.శ్రీనివాసులురెడ్డి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ వేడుకల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

కండలేరుకు పెరుగుతున్న నీటి మట్టం

రాపూరు : కండలేరు జలాశయంలో నీటిమట్టం క్రమంగా పెరుగుతుంది. ప్రస్తుతం జలాశయం నుంచి వివిధ కాలువలకు 1325 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ప్రస్తుతం 22.955 టీఎంసీల నీటి సామర్థ్యం ఉన్నట్లు ఏఈ కె.తిరుమలయ్య ప్రకటనలో పేర్కొన్నారు.

బస్సొచ్చే సరికి ఒక పాఠం పోతోంది

చేజర్ల, న్యూస్‌టుడే: బస్సు గమ్యం చేరడంలో జాప్యం, పాఠశాల వేళల్లో మార్పులు, అధ్వాన రహదారి కారణంగా చేజర్ల జడ్పీ ఉన్నత పాఠశాల, కళాశాల విద్యార్థులు ప్రతి రోజు ఒక పాఠాన్ని కోల్పోతున్నారు. పాడేరు, వావిలేరు, మైపాటివారికండ్రిక గ్రామాలనుంచి చేజర్లలో పాఠశాలలు, కళాశాలలకు 35 మంది విద్యార్థులు రాకపోకలు సాగిస్తుంటారు. ఉన్నత పాఠశాలలో 9.15, కళాశాలలో 9.00 గంటలకు తరగతులు ప్రారంభమవుతున్నాయి. నెల్లూరు నుంచి పాడేరు మార్గంలో వచ్చే బస్సు 9.30- 9.45 మధ్య చేజర్లకు చేరుతుంది. బస్సు దిగి పాఠశాలకు చేరే సరికి మరో పది నిమిషాల సమయం పడుతోంది. ఈ కారణంగా విద్యార్థులు మొదటి పీరియడ్ కోల్పోతున్నారు. గతంలో ఉన్నత పాఠశాల తరగతులు ఉదయం పది గంటలకు ప్రారంభమయ్యేవి. బడి మార్పు చేయటంతో గ్రామీణ విద్యార్థులకు కష్టాలు మొదలయ్యాయి. రహదారి బాగుంటే బస్సు మరో 15 నిమిషాలు ముందుగా చేరే అవకాశం ఉంది. ఈ బస్సు వేళలు ముందుకు మార్చాలని విద్యార్థులు కోరుతున్నారు.


పాడేరు బస్సు నుంచి దిగి బడికి వెళుతున్న విద్యార్థులు

నేడు చెకుముకి ప్రతిభ పరీక్ష

కోవూరు : కోవూరు మండల జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో కాపు వీధి శాఖా గ్రంథాలయంలో మంగళవారం చెకుముకి మండల స్థాయి ప్రతిభపరీక్ష నిర్వహిస్తున్నట్లు ఆ వేదిక మండల ప్రధాన కార్యదర్శి పుల్లయ్య సోమవారం తెలిపారు. మండలంలోని 14 ప్రభుత్వ, ప్రయివేటు ఉన్నత పాఠశాలలకు చెందిన 8, 9, 10 తరగతుల విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నట్లు ఆయన పేర్కొన్నారు.

నెల్లూరు

• నెల్లూరు • నెల్లూరు గ్రామీణం

లక్ష్యం మేరకు టీకా కార్యక్రమం

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), న్యూస్‌టుడే: అడల్ట్ బీసీజీ వ్యాక్సినేషన్ కార్యక్రమం లక్ష్యం మేర త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, టీబీ నివారణ అధికారి ఎస్.కె.ఖాదర్‌వలి పేర్కొన్నారు. నగరంలోని డామెన్ ఫౌండేషన్ కార్యాలయంలో ఎన్‌టీఈపీ, ఎన్‌టీఈపీఎస్, టీబీ హెచ్ఐవీ, పీపీఎమ్ భవ్య ప్రాజెక్టు సిబ్బందితో సమావేశం సోమవారం జరిగింది. టీబీ యూనిట్ల పనితీరును సమీక్షించి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో టీబీ నివారణ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు

నెల్లూరు(నగరపాలకసంస్థ): విద్యార్థులకు విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని జిల్లా ఉర్దూ పాఠశాలల ఉప తనిఖీ అధికారి షేక్ ఖాజా మొహిద్దీన్ తెలిపారు. సోమవారం నెల్లూరురూరల్ మండలం వావిలేటిపాడులోని ఉర్దూ ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు మహమ్మద్ రషీద్, ఉపాధ్యాయురాలు ఖాదర్‌ఉన్నీసాబేగం పాల్గొన్నారు.

సనాతన ధర్మాన్ని కాపాడుకుందాం

నెల్లూరు (వేదాయపాలెం): సనాతన ధర్మాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందని జనసేన నగర అధ్యక్షుడు దుగ్గిశెట్టి సుజయ్‌బాబు అన్నారు. సోమవారం నగరంలోని తల్పగిరి రంగ నాథ స్వామి ఆలయంలో జనసేన నగర పార్టీ ఆధ్వర్యంలో దీపారాధన కార్యక్రమం నిర్వహించారు.

నెల్లూరు (బీవీనగర్): తిరుమల లడ్డూలో కల్తీ నెయ్యి వాడిన వారికి శిక్ష పడాలని జనసేన పార్టీ కోర్ కమిటీ సభ్యులు నూనె మల్లికార్జున యాదవ్ డిమాండ్ చేశారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చేపట్టిన ప్రాయశ్చిత్త దీక్షకు సంఘీభావంగా ఆ పార్టీ జాతీయ మీడియా అధికార ప్రతినిధి, టిడ్కో ఛైర్మన్ వేములపాటి అజయకుమార్ సూచనల మేరకు సోమవారం శ్రీవేదగిరి లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయంలో నారాయణ హోమం నిర్వహించారు.

హెల్ప్‌లైన్‌కు ఫోన్‌చేస్తే తక్షణమే సమస్య పరిష్కారం



వినతులు స్వీకరిస్తున్న కమిషనర్ సూర్యతేజ

నెల్లూరు(నగరపాలకసంస్థ), న్యూస్‌టుడే: నెల్లూరు నగరపాలకసంస్థ పరిధిలో స్థానిక సమస్యలను కమాండ్ కంట్రోల్ విభాగంలో ఏర్పాటు చేసిన హెల్ప్‌లైన్ ఫోన్ ద్వారా తెలియజేస్తే తక్షణమే స్పందించి పరిష్కారం దిశగా చర్యలు చేపట్టేందుకు కృషి చేస్తామని కమిషనర్ సూర్యతేజ తెలిపారు. సోమవారం కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ విభాగం సమావేశ మందిరంలో ప్రజా సమస్యల పరిష్కార వేదికను నిర్వహించి ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ మొత్తం 31 ఫిర్యాదులు అందుకున్నామని అధికారులు సమన్వయంతో శాశ్వత పరిష్కారం చూపాలన్నారు. ఫిర్యాదుదారులు తమ సమస్యలను 9494018118 నంబరుకు వాట్సప్ ద్వారా లేదా 0861-2356777, 2316777 హెల్ప్‌లైన్ నంబర్లకు ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల లోపు తెలియజేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ శర్మద, ఆరోగ్యాధికారి డాక్టర్ చైతన్య తదితరులు పాల్గొన్నారు.

శిక్షణ.. ప్రేరణ

ప్రభుత్వ ఆదర్శ పాఠశాల విద్యార్థుల పరిశ్రమల బాట

న్యూస్‌టుడే, నెల్లూరు(జడ్పీ)



పైపుల తయారీ కంపెనీ వద్ద విద్యార్థులు

విద్యార్థులకు వస్తువుల తయారీని వివరించడంతో పాటు.. మార్కెట్‌లో మోసాలపై అవగాహనకు ప్రభుత్వం చర్యలు తీసుకుంది. అందుకు అనుగుణంగా తరగతులు నిర్వహించింది. పరిశ్రమల సందర్శనకు తీసుకెళ్లారు. ఇందుకు జిల్లాలో ఐదు పాఠశాలలు ఎంపిక చేయగా.. అందులో నెల్లూరు సంతపేటకు చెందిన ప్రభుత్వ ఆదర్శ ఉన్నత పాఠశాల ఉంది. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసులు సహకారంతో వెంకటేశ్వర్లు, ఇతర ఉపాధ్యాయులు ముందుగా కేంద్ర ప్రభుత్వ జాతీయ ప్రమాణాల సంస్థ ద్వారా వస్తువుల నాణ్యతా ప్రమాణాలపై ప్రత్యేక శిక్షణ పొందారు.

పోటీలు: శిక్షణ పొందిన ఉపాధ్యాయులు విద్యార్థులకు శిక్షణ ఇవ్వడంతో పాటు వివిధ పోటీలు నిర్వహించారు. మార్కెట్‌లో మోసాలు జరుగుతున్న నేటి రోజుల్లో ఐఎస్ఐ మార్కు, ప్రామాణికతలు ఎలా గుర్తించాలి, ఆ మార్కు ఎందుకు, ఎలా ఇస్తారు, మోసాల నుంచి ఎలా తప్పించుకోవాలి, సామాన్య వినియోగదారుడి నుంచి రైతుల వరకు మోసపోకుండా ఎలా జాగ్రత్తలు తీసుకోవాలనే అంశాలపై వ్యాసరచన, క్విజ్, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ముందుగా ప్రత్యేక తరగతులు జరిగాయి.

మూడు ప్రాంతాల్లో పర్యటన: నాణ్యతతో కూడిన వస్తువులు ఎలా తయారు చేస్తారో అంశం వివరించేందుకు ఆ పాఠశాలకు చెందిన 50 మంది విద్యార్థులను స్వయంగా పరిశ్రమల వద్దకు తీసుకెళ్లి వివరించారు. ఇందుకోసం ప్రత్యేకంగా బస్సులు ఏర్పాటు చేశారు. తిరుపతి, చిత్తూరు, గూడూరు తదితర ప్రాంతాల్లో ఉన్న పరిశ్రమలు, అక్కడ చేస్తున్న వస్తువుల తయారీ, నాణ్యతపై అవగాహన కల్పించారు.

భవిష్యత్తులో ఉపయోగం

– ఎస్.శ్రీనివాసులు, ప్రధానోపాధ్యాయులు



కేంద్ర ప్రభుత్వ సంస్థ అయిన బీఐఎస్ సహకారంతో మా ఉపాధ్యాయులు ప్రత్యేక శిక్షణ పొందారు. చిన్నప్పటి నుంచే నాణ్యత ప్రమాణాలపై విద్యార్థులకు ప్రత్యేకంగా అవగాహన కల్పిస్తున్నాం. శిక్షణ భవిష్యత్తులో ఉపయోగ పడుతుంది.

ఎన్నో విషయాలు తెలుసుకున్నాం


– ఎన్.దేవిశ్రీ చరణ్, పదో తరగతి విద్యార్థి



మార్కెట్‌లో జరుగుతున్న మోసాలకు ఎందరో బలైపోతున్నారు. ఐఎస్ఐ మార్కు, ఉంటుందనే సంగతి చాలా మందికి తెలియదు. ఉపాధ్యాయులు చక్కటి అవగాహన కల్పించారు.

అవగాహన పెరిగింది

– మల్లేశ్వరి, విద్యార్థిని, పదో తరగతి



నాణ్యతా ప్రమాణాలు ఎలా ఉంటాయి. పరిశ్రమలు గుర్తింపు ఎలా ఇస్తారు అనే అంశాలకు సంబంధించి మా ఉపాధ్యాయులు స్వయంగా పరిశ్రమలకు తీసుకెళ్లి చూపించారు. ఎంతో అవగాహన పెంచుకున్నాం. ఎన్నో విషయాలు నేర్చుకోవాలని ఉంది.

బాలయ్య సినీ స్వర్ణోత్సవం



సంబరాల్లో అభిమానులు

నెల్లూరు(సాంస్కృతికం), న్యూస్‌టుడే: సృజన సాహిత్య సాంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో సోమవారం రాత్రి టౌన్‌హాల్‌లో బాలయ్య సినీ స్వర్ణోత్సవం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులు నిర్వాహకులతో కలిసి కేకు కోసి సంబరాలు జరుపుకొన్నారు. సుస్వర ఆర్కెస్ట్రా వారు నిర్వహించిన బాలయ్య సినీ గీతాల సంగీత విభావరి ఆకట్టుకుంది. సంస్థ వ్యవస్థాపకుడు రాధాకృష్ణ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో తెలుగు మహిళ నెల్లూరు పార్లమెంట్ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి విజయమ్మ, వేణుగోపాల్, మన్నెం పెంచలనాయుడు, షేక్ రియాజ్‌బాషా, సుజాతరెడ్డి, నవనిర్మాణ సేన జిల్లా అధ్యక్షుడు ఆర్కాట్ కుమార్, రచయిత్రి పార్లపల్లి నాగేశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

వ్యాసరచన, వక్తృత్వ పోటీలు

నెల్లూరు(నగరపాలకసంస్థ), న్యూస్‌టుడే: ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో ఆరు నుంచి పదో తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు స్వర్ణాంధ్ర సాధించేందుకు అయిదేళ్లలో విద్యారంగంలో తీసుకోవాల్సిన సంస్కరణలపై జిల్లా స్థాయి వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించినట్లు జిల్లా ఉప విద్యాశాఖాధికారిణి లక్ష్మీ ప్రసన్న తెలిపారు. సోమవారం నెల్లూరులోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పోటీలు జరిగాయి. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి మురళీధర, అబ్దుల్ అమీద్, సమగ్రశిక్షా అభియాన్ ఏపీవో ప్రసాదు పాల్గొన్నారు.



ధ్రువపత్రాలు అందుకున్న విద్యార్థులతో ఉప విద్యాశాఖాధికారిణి లక్ష్మీప్రసన్న

నియోజకవర్గాల్లో శాంతియుత నిరసనలు

నెల్లూరు(జడ్పీ), న్యూస్‌టుడే: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఖరిని నిరసిస్తూ అక్టోబర్ 2వ జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో శాంతియుత నిరసనలు చేపడతామని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు చేవూరు దేవకుమార్‌రెడ్డి తెలిపారు. సోమవారం జిల్లా పార్టీ కార్యాలయంలో ముఖ్య నాయకులతో సమావేశాన్ని నిర్వహించారు. అనంతరం విలేకర్లతో మాట్లాడుతూ రాష్ట్రంలో వంద రోజుల కూటమి పాలనలో ఎన్నికల హామీలు అమలు చేయలేదన్నారు. పీసీసీ ఉపాధ్యక్షుడు ఉడతా వెంకట్రావ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

సాగునీటి కాలువల్లో పూడిక తీయించాలి

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): జిల్లాలో సాగునీటి కాలువల్లో తక్షణమే పూడికలు తీయాలని భాజపా నమామి గంగే రాష్ట్ర కన్వీనర్ మిడతల రమేష్ డిమాండ్ చేశారు.

3న జిల్లా విజన్ ప్రణాళికపై కార్యశాల

నెల్లూరు(కలెక్టరేట్): స్వర్ణాంధ్ర-2047 జిల్లా, మండల విజన్ ప్రణాళికకు సంబంధించిన వర్క్‌షాప్ అక్టోబరు మూడో తేదీన నెల్లూరులో నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ ఒ.ఆనంద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం ఉదయం 10 గంటలకు నెల్లూరులోని శ్రీవెంకటేశ్వర కస్తూర్బా కళాక్షేత్రంలో కార్యక్రమం జరుగుతుందన్నారు. జిల్లా మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, జిల్లాస్థాయి ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొంటారని తెలిపారు. జిల్లాలో రైతు సంఘాలు, ఎన్జీవోలు, వ్యాపార వాణిజ్య సంఘాలు, విద్యావేత్తలు, ఆర్థికవేత్తలు, ప్రముఖవ్యక్తులు పాల్గొని సలహాలు సూచనలు ఇవ్వాలని కోరారు.

లక్ష్యాలు పూర్తి చేయండి

నెల్లూరు(కలెక్టరేట్): జిల్లాలో మైక్రో ఇరిగేషన్ కింద సాధించాల్సిన లక్ష్యాన్ని అందుకునేందుకు సంబంధిత అధికారులు సమష్టిగా కృషి చేయాలని కలెక్టర్ ఒ.ఆనంద్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ నుంచి సబ్ కలెక్టర్, మున్సిపల్ కమిషనర్లు, ఆర్డీవోలు, ఎంపీడీవోలు, తహసీల్దార్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఎన్టీఆర్‌భరోసా పింఛన్లు ఒకటో తేదీనే 95 శాతం పైగా పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు.

నిర్లక్ష్యంతోనే చెత్తకు నిప్పు



కార్మికులు రోజూ చెత్త తొలగించడం లేదు. ఫలితంగా నగర ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మూలాపేటలోని అలంకార్ సెంటరు నుంచి లిటిల్ ఏంజల్స్ స్కూలుకు వెళ్లే రోడ్డులో సోమవారం చెత్తను దహనం చేశారు. మధ్యాహ్నం పాఠశాలలు వదిలే సమయంలో పొగతో విద్యార్థులు, వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. అధికారులు స్పందించి వ్యర్థాలకు నిప్పు పెట్టకుండా చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. ప్రతిరోజూ వ్యర్థాలను తొలగిస్తామని నగరపాలక ఆరోగ్యాధికారి డాక్టర్ చైతన్య తెలిపారు.

– న్యూస్‌టుడే, నెల్లూరు(టౌన్)

సారూ.. మీరైతే ఇళ్ల మధ్య ఉండగలరా?

హరనాథపురం నాగసాయి మందిరం సమీపంలో వర్షపు నీరు ఖాళీ స్థలాల్లో నిల్వ చేరడంతో పాచిపట్టి దుర్గంధం వెదజల్లుతోంది. దీంతో దోమలు విజృంభించి వ్యాధులు ప్రబలుతున్నాయి. ఖాళీ స్థలాల యజమానులకు నోటీసులు జారీ చేయాల్సి ఉన్నా.. అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు తెలిపారు. సమస్య పరిష్కరిస్తామని నగరపాలక ఆరోగ్యాధికారి డాక్టర్ చైతన్య తెలిపారు.

– న్యూస్‌టుడే, నెల్లూరు(రంగనాయకులపేట)



రాళ్లు తేలిన రోడ్డులో ప్రయాణమెలా?



నగరంలోని రాంజీనగర్ ఏడో అడ్డరోడ్డు సమీపంలో సీసీ రోడ్డు కంకరలేచి గుంతలుపడ్డాయి. 7, 8వీధులతో పాటు బాలాజీనగర్, చిల్డ్రన్స్‌పార్కు ప్రధాన మార్గానికి వెళ్లే రోడ్డు కావడంతో వాహనదారులు రాకపోకల సమయంలో గుంతలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి వేళ దీపాలు సరిగా లేక ద్విచక్రవాహనదారులు ప్రమాదాలబారిన పడుతున్నారు. మరమ్మతులకు చర్యలు తీసుకుంటామని నగరపాలక సంస్థ అధికారులు తెలిపారు.

– న్యూస్‌టుడే, నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట)

బలిజ విద్యార్థులకు అవార్డులు

నెల్లూరు(టౌన్): ఉమ్మడి నెల్లూరు జిల్లాలో 2023-24 విద్యాసంవత్సరంలో పదో తరగతిలో 550పైగా మార్కులు సాధించిన విద్యార్థులకు, ఉత్తీర్ణులై తల్లిదండ్రులు లేని వారికి ఆర్థిక పురస్కారాలు అందించనున్నట్లు ఆంధ్రప్రదేశ్ కాపు టీచర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కమతం సుబ్బారావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు మార్కుల మెమో, డెత్ సర్టిఫికెట్, ఆధార్‌ను వాట్సాప్ నంబరు ద్వారా నమోదు చేసుకోవాలని కోరారు.

ఆంజనేయస్వామికి ఆకుపూజ

నెల్లూరు (సాంస్కృతికం): సంతపేటలోని ఆంజనేయస్వామి దేవస్థానంలో స్వామివారికి శ్రీకృష్ణచరిత మానస ప్రచారమండలి ఆధ్వర్యంలో ఆకుపూజ నిర్వహించి వడమాలలు సమర్పించారు. గుంటూరు జిల్లా కొండముడి గ్రూప్ దేవస్థానాల ఈవోగా పనిచేస్తూ బదిలీపై సంతపేట ఆంజనేయస్వామి దేవస్థానం ఈవోగా బదిలీపై వచ్చిన పి.రఘురామయ్య బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా కార్యక్రమాన్ని నిర్వహించి భక్తులకు అన్నప్రసాదాలను పంపిణీ చేశారు.

మేమున్నాం.. మీకు తోడుగా! (10 AM to 1 PM) నెల్లూరు, గ్రామీణం 80085 50332 80085 74001

సమస్య: రంగనాయకులపేట దేవస్థానం నుంచి నాలుగు కాళ్ల మండపం వరకు కుక్కల బెడద ఉంది. – శ్రీనివాసాచార్యులు

సమాధానం: చర్యలు చేపడతాం.

–డాక్టర్ మదన్‌మోహన్, వెటర్నరీ అధికారి

? జెండావీధిలో దోమల బెడద ఎక్కువగా ఉంది. – షానవాజ్

✓ దోమల నివారణకు ఫాగింగ్ చేయిస్తాం.

– డాక్టర్ చైతన్య, ఆరోగ్యాధికారి

– న్యూస్‌టుడే, నెల్లూరు(నగరపాలకసంస్థ)

బాధ్యతల స్వీకరణ

నెల్లూరు(జడ్పీ), న్యూస్‌టుడే: డ్వామా పీడీగా నియమితులైన గంగా భవాని సోమవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం కలెక్టర్ ఆనంద్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. సిబ్బంది పరిచయం చేసుకున్నారు.

ఆదరించేవారు లేరు.. ఆదుకోండయ్యా

న్యూస్‌టుడే, నెల్లూరు(కలెక్టరేట్)

ఆధారం లేదు ఆదుకోండయ్యా.. అంటూ బాధితులు సోమవారం కలెక్టర్ ఆనంద్‌కుకు విన్నవించుకున్నారు. కలెక్టరేట్‌లో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వినతులు సమర్పించారు. పింఛన్ల మంజూరు, ఉపాధి కల్పన తదితర విషయాలు ఆయన దృష్టికి తీసుకెళ్లారు.

చేతులు పనిచేయవు.. చేయూత నివ్వండి

బత్తల నాగేంద్ర– ఉదయగిరి



నేను దివ్యాంగుడిని. రెండు చేతులు పని చేయవు. తండ్రి చనిపోయారు. ఏ పని చేసుకోలేను. ఇంటర్మీడియట్ చదువుకున్నా. నా తల్లి వయసు 60 సంవత్సరాలు కావడంతో కూలీ పనులకు వెళ్లలేదు. నన్ను పోషించలేక ఇబ్బందులు పడుతుంది. అధికారులు చిన్న ఉద్యోగం ఇప్పించి ఆదుకోవాలి.

వృద్ధాప్యం.. అనారోగ్యం

– షేక్ శిబాబీ– అరిగెలవారివీధి, ఫత్తేఖాన్‌పేట



నాకు చెవులు వినబడవు, బ్రెయిన్ స్ట్రోక్‌తో ఆరోగ్యం బాగా లేదు. కళ్లు కూడా కనిపించడం లేదు. వృద్ధాప్యం కారణంగా ఏ పని చేసుకోలేను. పింఛను ఇప్పించి ఆదుకోండి.

వితంతు పింఛను మంజూరు కాక..

– ఎస్‌డీ ఆయేషా– పొర్లుకట్ట, నెల్లూరునగరం



నా భర్త అనారోగ్యం కారణంగా 2023 మే నెలలో చనిపోయారు. కుమారుడు, కుమార్తె ఉన్నారు. వారికి పెళ్లిళ్లు జరిగాయి. నేను ఒక్కదాన్నే ఉంటున్నా. ఎటువంటి జీవనాధారం లేదు. నన్ను చూసేందుకు ఎవరూ లేరు. నాకు వితంతు పింఛను మంజూరు చేసి ఆదుకోండి.

ఇంట్లో బాణసంచా నిల్వలు

నెల్లూరు(నేర విభాగం), న్యూస్‌టుడే: ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన బాణసంచా నిల్వలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వారి కథనం మేరకు.. పరమేశ్వరి నగర్‌కు చెందిన కె.శ్రీవాసులు పొర్లుకట్టలోని తన రేకుల ఇంట్లో బాణసంచా అక్రమంగా నిల్వ ఉంచారు. దీనిపై సమాచారం అందుకున్న సంతపేట ఇన్‌స్పెక్టర్ ఎం.శ్రీనివాసరావు సిబ్బందితో కలిసి సోమవారం దాడి చేశారు. అక్రమంగా నిల్వ ఉంచిన బాణసంచా స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.



పోలీసులు స్వాధీనం చేసుకున్న బాణసంచా

ఆశా కార్యకర్తల ఆందోళన



బైఠాయించి నిరసన తెలుపుతున్న ఆశా కార్యకర్తలు

నెల్లూరు (కలెక్టరేట్), న్యూస్‌టుడే: ఆశా వర్కర్లపై రాజకీయ వేధింపులు ఆపాలని, 18 ఏళ్లుగా ఎలాంటి ఆరోపణలు లేకుండా పని చేస్తున్న ఆశా వర్కర్ విజయమ్మను విచారణ లేకుండా తొలగించడం దుర్మార్గమని ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ధనలక్ష్మి పేర్కొన్నారు. సోమవారం ఆశా వర్కర్ల సమస్యలపై కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.అజయ్‌కుమార్ మాట్లాడారు.

రౌడీ షీటరుపై హత్యాయత్నం

నెల్లూరు(నేర విభాగం): రౌడీషీటరుపై కొందరు దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడిన ఘటనపై సంతపేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. వారి కథనం మేరకు.. నెల్లూరు బోడిగాడితోటకు చెందిన ఆర్.ఆర్ముగం భార్య రైలులో భిక్షాటన చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. అదే ప్రాంతానికి చెందిన ఆకాష్ భార్య సైతం భిక్షాటన చేసేది. వారి మధ్య ఇటీవల ఘర్షణ చోటు చేసుకుంది. ఆర్ముగంపై ఆకాష్ చేయి చేసుకున్నాడు. ఈ నేపథ్యంలో ఈనెల సెప్టెంబరు 29న అర్ధరాత్రి ఆర్ముగం తన స్నేహితుడైన తడికల బజారు సెంటరుకు చెందిన రౌడీషీటర్ ప్రణయ్‌తో సీసీఎస్ పోలీసు స్టేషన్ సమీపంలో మాట్లాడుతుండగా ఆకాష్, పెంచలయ్య, సాయికుమార్, రాములు ఆటోలో అక్కడికి చేరుకుని వారిపై రాళ్లతో దాడి చేశారు. వారు పరుగులు తీయగా వెంబడించి కత్తితో ప్రణయ్‌పై దాడిచేసి పరారయ్యారు. స్నేహితుడిని చికిత్స నిమిత్తం జిల్లా ప్రభుత్వాస్పత్రిలో చేర్పించి ఈ మేరకు సంతపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. నిందితులపై హత్యాయత్నం కేసు నమోదు చేశారు.

సైబర్ నేరంపై కేసు

నెల్లూరు(నేర విభాగం): ఖాతాలోని నగదు కాజేసిన ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. వారి కథనం మేరకు.. ఫత్తేఖాన్‌పేట షకిలం వారి వీధికి చెందిన పురుషోత్తం శ్రీహరి నగర్‌లోని ఓ డెవలపర్స్ కంపెనీలో అకౌంటెంట్‌గా పనిచేస్తున్నారు. అదనంగా డబ్బులు సంపాదించేందుకు వివరాలు పంపాలని ఆయన వాట్సాప్‌కు మెసేజ్ వచ్చింది. మెసేజ్‌ను తెరచి అందులో తన వివరాలను పొందుపరిచారు. కొద్దిసేపటికీ అతని బ్యాంకు ఖాతాలోని రూ.1.45లక్షల నగదును సైబర్ నేరగాళ్లు కాజేశారు. బాధితుడు తక్షణమే సైబర్ క్రైమ్ కంట్రోల్ సెల్‌కు ఫిర్యాదు చేశారు. సోమవారం చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇన్‌స్పెక్టర్ కోటేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వరద బాధితులకు విరాళం

నెల్లూరు(విద్య) : విజయవాడలో వరద వల్ల సర్వం కోల్పోయిన బాధితులకు సర్వేపల్లి నియోజకవర్గంలోని ప్రైవేట్ స్కూల్స్ విద్యార్థులు, యాజమాన్యం అందించిన రూ.3,92,371లు సోమవారం ఆపస్మా జిల్లా అధ్యక్షుడు శ్రీధర్‌కు అందజేశారు. విరాళాలను సీఎం సహాయ నిధికి పంపనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ట్రెజరర్ కృష్ణారావు, సర్వేపల్లి ఆపస్మా అధ్యక్షుడు సుబ్బరాయుడు, గౌరవాధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జిల్లా జట్ల ఎంపిక

నెల్లూరు(క్రీడా విభాగం): ఆట్యా పాట్యా సబ్ జూనియర్ బాల బాలికల జిల్లా స్థాయి ఎంపికలు అక్టోబర్ ఒకటో తేదీన నవాబుపేటలోని బీవీఎస్ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్నట్లు ఆట్యాపాట్యా అసోసియేషన్ కార్యదర్శి కె.కృష్ణవేణి తెలిపారు. పోటీల్లో ప్రతిభ కనబరిచిన వారు అక్టోబరు 5, 6 తేదీల్లో బీవీఎస్ ఉన్నత పాఠశాలలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు.

అందరినీ విచారించాలి

నెల్లూరు(బృందావనం): తిరుమల లడ్డూలో ఉపయోగించిన నెయ్యి కల్తీ విషయంలో మాజీ సీఎం జగన్‌తో పాటు తితిదే ఛైర్మన్‌ను విచారణ చేయాలని భాజపా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు భరత్ కుమార్ యాదవ్ డిమాండ్ చేశారు. సోమవారం నగరంలోని భాజపా కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. సమావేశంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి కె.రాజేశ్వరి, నమామి గంగే కన్వీనర్ ఎం.రమేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేష్, జిల్లా కార్యదర్శి ప్రవీణ్‌కుమార్, మోర్చా నాయకులు అశోక్ నాయుడు, గిరికుమార్ గౌడ్, నాయకులు పాల్గొన్నారు.

కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలి

నెల్లూరు(నగరపాలకసంస్థ): రాష్ట్ర ప్రభుత్వంలోని వివిధ శాఖల్లో ఉన్న కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ కార్మికులందరినీ పర్మినెంట్ చేసి సమాన పనికి సమాన వేతనం అందించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షులు టీవీ ప్రసాద్ డిమాండ్ చేశారు. సోమవారం సీఐటీయూ నెల్లూరు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో వీఆర్సీ సెంటరులోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేశారు. వివిధ సంఘాల నాయకులు ఎన్.సతీష్‌కుమార్, సుమన్, రామాంజనేయులు, విజయ్, నాగరాజు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

రాష్ట్ర స్థాయి పోటీలకు విద్యార్థులు

నెల్లూరు(నగరపాలకసంస్థ): నెల్లూరు జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఇటీవల ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో నిర్వహించిన టేబుల్ టెన్నిస్ పోటీల్లో అండర్-14 విభాగంలో డాక్టర్ కిషోర్స్ రత్నం జేఈఈ, కె25 మెడికల్ ఒలింపియాడ్ విద్యార్థులు ప్రతిభ కనబరిచి అక్టోబరు నెలలో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. సోమవారం సరస్వతీనగర్‌లోని డాక్టర్ కిషోర్స్ రత్నం స్కూలులో విద్యాసంస్థల డైరెక్టర్లు కృష్ణకిషోర్, వాసంతి కిషోర్ వారికి అభినందనలు తెలియజేశారు. ఎనిమిదో తరగతి విద్యార్థులు బి.సూర్యజశ్వంత్, పి.వాసవ్య, టి.చిరుహాస్, కె.వైశాంత్, టి.నవీన్ కార్తీక్ ఎంపికైనట్లు తెలిపారు.

కొత్త సర్కిళ్లకు జిల్లా అధికారులు

నెల్లూరు(టౌన్), న్యూస్‌టుడే: విద్యుత్తుశాఖలో కొత్త సర్కిళ్ల ఏర్పాటులో భాగంగా కొంతమంది అధికారులను నెల్లూరు జిల్లా నుంచి నూతనంగా ఏర్పడిన సర్కిళ్లకు పంపించారు. ఆంధ్రప్రదేశ్ దక్షిణ ప్రాంత విద్యుత్తు పంపిణీ సంస్థలో చిత్తూరు, అన్నమయ్య, నంద్యాల, సత్యసాయి జిల్లాలు కొత్త సర్కిళ్లుగా ఏర్పడ్డాయి.

ఇన్‌ఛార్జి డీఎఫ్‌వోగా ధర్మరాజు బాధ్యతల స్వీకరణ

నెల్లూరు(బృందావనం), న్యూస్‌టుడే: జిల్లా అటవీ శాఖ ఇన్‌ఛార్జి అధికారిగా ధర్మరాజు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ డీఎఫ్‌వోగా పనిచేస్తున్న చంద్రశేఖర్ అనంతపురం బదిలీ అయ్యారు. తిరుపతి సామాజిక అటవీ విభాగంలో డీఎఫ్‌వోగా పనిచేస్తున్న ధర్మారాజును ప్రభుత్వం ఇక్కడ నియమించింది.

ఆక్రమణలపై కలెక్టర్‌కు ఎమ్మెల్యే ఫిర్యాదు

నెల్లూరు(కలెక్టరేట్): నియోజకవర్గంలో భూకబ్జాలు ఎక్కువయ్యాయని వాటిపై చర్యలు తీసుకోవాలని వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ సోమవారం కలెక్టర్ ఒ.ఆనంద్‌కు వినతిపత్రం అందించారు. అధికారులు రెవెన్యూ సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టాలని తెలిపారు.

పోషకాహార వారోత్సవాలు

నెల్లూరు(బీవీనగర్): నగరంలోని నారాయణ రెడ్డి పేట సెక్టార్ పరిధిలోని నవలాకుల తోట-2 అంగన్‌వాడీ కేంద్రంలో పోషకాహార వారోత్సవాలు సోమవారం జరిగాయి. అంగన్‌వాడీ సూపర్‌వైజరు లక్ష్మీ రాజ్యం తక్కువ ఖర్చుతో పోష్టికాహారం ఎలా తయారు చేసుకోవాలో వివరించారు.

ఆక్రమణలతో ఆనవాళ్లు మాయం

న్యూస్‌టుడే, నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట)

నెల్లూరు నగరంలో ఖాళీ స్థలం కనిపిస్తే చాలు అక్రమార్కులు వాలిపోతున్నారు. ఇప్పటికే రహదారుల వెంబడి స్థలాలు ఆక్రమంచి దుకాణాలు నిర్మిస్తున్నారు. ప్రస్తుతం కాలువ, రోడ్డు మధ్య ఉన్న ఖాళీ ప్రదేశంలో నిర్మాణాలు చేస్తున్నారు. ఈ పరిస్థితి బాలాజీనగర్, నిర్మల్‌నగర్‌లో నెలకొంది. ఆక్రమణల వల్ల రోడ్డుపై నీరు నిలిచి స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. స్థానిక అన్నపూర్ణ అపార్ట్‌మెంట్ సమీపంలో స్వర్ణాల చెరువు నుంచి దిగువకు వచ్చే కాలువ బాలాజీనగర్ మీదుగా వెళుతోంది. ఒకప్పుడు సాగునీరు తీసుకెళ్లే ఈ కాలువ.. పది అడుగులకు పైగా వెడల్పు ఉండేది. ఆక్రమణలతో ప్రస్తుతం సైడుకాలువగా మారి రెండు అడుగులకే పరిమితమైంది. కాలువ వెంబడి మొత్తం ఇదే పరిస్థితి ఉంది.

నిర్మల్‌నగర్‌లో..: నిర్మల్‌నగర్‌లో కాలువ-రోడ్డుకు మధ్య ఉన్న కొద్దిపాటి స్థలంలో నిర్మాణాలు చేస్తున్నారు. కాలువలో సక్రమంగా పూడిక తీయలేని పరిస్థితి నెలకొంది. దోమల వ్యాప్తి అధికంగా ఉందని, చిన్నపాటి వర్షం వచ్చినా రోడ్డుపై నీరు నిలిచి ఉంటోందని.. ఓ మోస్తరు వర్షం వచ్చిందంటే ఇబ్బందులు పడుతున్నట్లు స్థానికులు వాపోతున్నారు. పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేదని తెలిపారు. ఉన్నతాధికారులు చర్యలు చేపట్టి ఆక్రమణలు తొలగించి, కాలువల్లో పూర్తిస్థాయిలో పూడిక తీయించాలని స్థానికులు కోరుతున్నారు.

● సమస్యను పట్టణ ప్రణాళిక అధికారుల దృష్టికి తీసుకెళ్లగా పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు.



కాలువ వెంబడి రోడ్డు ఆక్రమించి చేపట్టిన నిర్మాణం